



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు] అమ్మబడును




సంప్రదించవలసిన నెంబర్లు

కె. అబెద్నేగో(రాజు బాబు ) : 9985998066
సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 150 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శనివారం 21 ఫిబ్రవరి 2026 | పేజీలు : 12 | వెల : 2/-




## నాలెడ్జ్, క్రియేటర్

# ఎకానమీ కేంద్రంగా ఆంధ్రప్రదేశ్

- టెక్ నైపుణ్యాలున్న యువశక్తి రాష్ట్రానికి అతిపెద్ద వనరు
- ఏఐ లివింగ్ ల్యాబ్స్, డిజైన్ ఇంజనీరింగ్ లో భాగస్వామ్యం
- ఇండియా ఏఐ-ఇంపాక్ట్ సమ్మిట్ లో దిగ్గజ పారిశ్రామికవేత్తలతో సీఎం చంద్రబాబు భేటీ
- సదస్సులో ఏఐ సాంకేతికత ప్రదర్శన స్టాళ్లను సందర్శించిన సీఎం

ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని క్రియేటర్ ఎకానమీగా తీర్చిదిద్దేందుకు వీలుగా తగిన ప్రణాళికల్ని సిద్ధం చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దీనికి వివిధ టెక్ కంపెనీల భాగస్వామ్యం కూడా అవసరమని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏపీలో టెక్ నైపుణ్యాలు ఉన్న యువశక్తి అతిపెద్ద వనరు అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. యువతను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ రంగాల్లో నిపుణులుగా తయారు చేసేందుకు ఉన్న అవకాశాలను వినియోగించుకుంటామని వెల్లడించారు. ఢిల్లీలోని ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో దిగ్గజ పారిశ్రామిక వేత్తలతో ఆయన వేర్వేరుగా భేటీ అయ్యారు. భారత్ మండపంలో ఉన్న ఏపీ పెవిలియన్ లో ఆడోబ్ సీఈఓ శాంతను నారాయణ్, ఆటోడెస్క్ ఏఐ హెడ్ మైక్ హాలే, ఆరామ్ కో ఇండియా డైరెక్టర్ అబ్దుల్ రెహమాన్ ఐతుకైర్ ముఖ్యమంత్రితో సమావేశం అయ్యారు. వీరితో పాటు లెగో ఎడ్యుకేషన్ వైస్ ప్రెసిడెంట్ టామ్ హాల్ , ఆధార్ ఫౌండర్ సీటీఓ శ్రీకాంత్ నాదముని, కాలిఫోర్నియాకు చెందిన ఖోస్లా వెంచర్స్ మేనేజింగ్ డైరెక్టర్ వినోద్ ఖోస్లా సీఎంతో భేటీ అయ్యారు. ఏపీలో సౌర విద్యుత్ సహా క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులపై మిగతా .. 2లో..

### గంజాయితో పట్టుబడిన
## 11 మంది అరెస్టు



బొబ్బిలి, విశ్వం వాయిస్ న్యూస్ : విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం కోమటిపల్లిలో నిర్వహించిన తనిఖీల్లో 11 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గంజాయి విక్రయిస్తున్న నలుగురిని, తాగుతున్న ఏడుగురిని అరెస్టు చేసి పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ భవ్యరెడ్డి వెల్లడించారు. సీతానగరానికి చెందిన అత్తాపూర్ గణేశ్, బొబ్బిలి మండలం విజయపురికి చెందిన అఖిల్, పట్నానికి చెందిన లంకచంద్రులు ఒడిశా రాష్ట్రం రాయగడ నుంచి మిగతా .. 2లో..

### ట్రంప్ టారిఫ్‌లు
## చట్టవిరుద్ధం

### అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పు



విశ్వం వాయిస్ న్యూస్ : టారిఫ్‌ల విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. పలు దేశాలపై ఆయన విధించిన టారిఫ్‌లు చట్ట విరుద్ధమైనవిగా పేర్కొంటూ అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఆయన తన అధికారాలను అతిక్రమించి సుంకాలు విధించారని పేర్కొంది. టారిఫ్‌ల విషయంలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్ సారథ్యంలోని ధర్మాసనం 6-3 మెజార్టీతో తీర్పు వెలువరించింది. అత్యవసర అధికారాల చట్టం కింద ట్రంప్ ఏకపక్షంగా ప్రతీకార సుంకాలు సహా ఈ టారిఫ్‌లు మిగతా .. 2లో..

### ఆయేషా మీరా హత్య కేసు..
## సీబీఐ కోర్టు కీలక ఆదేశాలు

విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన ఆయేషా మీరా హత్య కేసులో సీబీఐ కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. వైద్య బృందం సేకరించిన అవశేషాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని ఆదేశించింది. ఫిబ్రవరి 27న మిగతా .. 2లో..

### తిరుమల లడ్డూ కల్తీ..
## ఏకసభ్య కమిషన్ ఏర్పాటు



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై ఏపీ ప్రభుత్వం విచారణ వేగవంతం చేసింది. విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేశ్‌కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 45 రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.


### రాష్ట్రంలో పురావస్తు తవ్వకాలు
## బౌద్ధ సర్క్యూట్ అభివృద్ధికి పెద్దపీట

### శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం
### తెలంగాణలో ఉన్న ఏపీ పురావస్తు సంపద రప్పించేందుకు చర్యలు చేపట్టామని వెల్లడి

అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చారిత్రక వారసత్వాన్ని కాపాడేందుకు, పురావస్తు తవ్వకాలను ముమ్మరం చేయడంతో పాటు బౌద్ధ సర్క్యూట్‌లను అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. శుక్రవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అడిగిన ప్రశ్నలకు మంత్రి కందుల దుర్గేష్ క్లుప్తంగా సమాధానమిచ్చారు. రాష్ట్ర విభజనకు ముందు ఆంధ్రప్రదేశ్‌లో మిగతా .. 2లో..

### ఏఐ అభివృద్ధి కోసం ప్రత్యేకమైన
## వార్ రూమ్ ఏర్పాటు చేయాలి

### తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డి



దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ : దిల్లీలో జరుగుతున్న ఏఐ సదస్సులో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఏఐ శకం ఇప్పటికే మొదలైందని అన్నారు. "గతంలో పారిశ్రామిక విప్లవం వచ్చింది. ఇప్పుడు సాఫ్ట్‌వేర్ విప్లవం నడుస్తోంది. ఏఐ రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి. ఏఐ అభివృద్ధి కోసం ప్రత్యేకమైన వార్ రూమ్ ఏర్పాటు చేయాలి. ఏఐ వార్ రూమ్ కోసం హైదరాబాద్ ఎంతో అనువైన ప్రదేశం. హైదరాబాద్‌లో ఏఐ వర్సిటీని ఇప్పటికే సకల వసతులతో ఏర్పాటు చేశాం. ఏఐ రంగంలో మిగతా .. 2లో..

### వేసవి రద్దీ.. డేటా ఆధారిత ప్రణాళికతో
## మెరుగైన సౌకర్యాలు

### తితిదే అదనపు ఈవో

తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ : వేసవిలో తిరుమలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి తెలిపారు. డేటా ఆధారిత ప్రణాళికతో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. సామాన్య భక్తులకు వీలైనంత త్వరగా మిగతా .. 2లో..

### ఇనాం భూముల సమస్య..
## త్వరలోనే పరిష్కారం

### మంత్రి అనగాని సత్యప్రసాద్



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలను ఒకే డిజిటల్ వ్యవస్థ కిందకు తీసుకొచ్చినట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ అసెంబ్లీలో తెలిపారు. పాత రికార్డులు స్కాన్ చేసి, శాశ్వత డిజిటల్ గుర్తింపుతో భద్రపరుస్తున్నట్లు చెప్పారు. రెవెన్యూ శాఖకు బడ్జెట్ కేటాయింపులపై అసెంబ్లీలో మంత్రి మాట్లాడారు. 22ఏ నిషేధిత జాబితా భూముల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. 22ఏ భూముల తొలగింపు సులభతరం మిగతా .. 2లో..

### విద్యుత్ రంగాన్ని
## వైకాపా సర్వనాశనం చేసింది

### మంత్రి గొట్టిపాటి రవికుమార్



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : విద్యుత్ రంగం.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభం అని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. దేశంలో విద్యుత్ సంస్కరణలకు నాంది పలికిన వ్యక్తి.. చంద్రబాబు అని కొనియాడారు. అసెంబ్లీలో బడ్జెట్‌పై మిగతా .. 2లో..

### వైకాపా ఎమ్మెల్సీలు
## క్షమించరాని పాపం చేశారు

### మంత్రి నారా లోకేశ్



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : వైకాపా ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలపై మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. చెప్పులు వేసుకొని దేవుడి ఫొటోతో సభలోకి వెళ్లినట్లు సాక్ష్యం చూపించగలరా అని బొత్స సవాల్ విసరగా.. స్పందించిన నారా లోకేశ్ మిగతా .. 2లో..

## ఏపీలో క్రైమ్ రేటు 6 శాతం తగ్గింది

### సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు
### తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు-గీత దాటితే కటకటాలే...
### హోం మంత్రి వంగలపూడి అనిత



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : ఏపీలో వైసీపీ ప్రభుత్వంతో పోలిస్తే కూటమి నాయకత్వంలో క్రైమ్ రేటు 6 శాతం తగ్గిందని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. హోంశాఖ బడ్జెట్ మిగతా .. 2లో..

### వ్యాపారి ఇంట్లో సీక్రెట్ వాల్..
## దాని వెనుక రూ.కోట్ల బంగారం




విశ్వం వాయిస్ న్యూస్ : పాత సినిమాల్లో చూపించినట్లుగా రాజస్థాన్‌లోని ఒక వ్యాపారి ఇంట్లో సీక్రెట్ వాల్.. దానివెనక రూ.కోట్లు విలువచేసే బంగారమున్న స్ట్రాంగ్‌రూమ్ బయటపడింది. ఇదంతా చూసి ఐటీ సోదాలకు వచ్చిన అధికారులు విస్తుపోయారు. రూ.100కోట్ల పన్ను ఎగవేత ఆరోపణల్లో భాగంగా కన్హా మిగతా .. 2లో..

### దేవుడి ఫొటోతో నిరసన..
## కఠిన చర్యలు తీసుకోవాలి : కూటమి నేతలు



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : ఏపీ శాసనమండలిలో వైకాపా సభ్యులు చెప్పులు, బూట్లు వేసుకుని దేవుడి ఫొటోలను ప్రదర్శించడాన్ని కూటమి సభ్యులు తీవ్రంగా ఖండించారు. ఛైర్మన్ ఛాంబర్ వద్ద మంత్రి లోకేశ్ నేతృత్వంలో ఎన్డీఏ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. వైకాపా చేసిన మహాపచారంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, అనిత, గుమ్మడి సంధ్యారాణి, సవిత, గొట్టిపాటి రవి, రామానాయుడు, కొల్లు రవీంద్ర, కూటమి ఎమ్మెల్సీలు నిరసనలో పాల్గొన్నారు. హిందు మతాన్ని అవమానించారని ఛైర్మన్‌కు మంత్రులు తెలిపారు. ఇలాంటి చర్యను ఛైర్మన్ ఎలా అంగీకరిస్తారని నిలదీశారు. వైకాపా చేసింది తప్పేనని మండలి ఛైర్మన్ మోషేన్ రాజు స్పష్టం చేశారు. వైకాపా సభ్యులను పిలిచి మాట్లాడతానని ఛైర్మన్ తెలిపారు. బహిరంగ క్షమాపణలు చెప్పించి లెంపలేసుకునేలా చేయాలని కూటమి సభ్యులు డిమాండ్ చేశారు.

**హిందువుల మనోభావాలు దెబ్బతీశారు.. పయ్యావుల**

చట్టసభ సాక్షిగా వైకాపా మిగతా .. 2లో..


## ఎల్బీనగర్ చట్నీస్ హోటల్‌లో పేలుడు




హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : ఎల్బీనగర్‌లోని ఆర్కేపురం చట్నీస్ హోటల్‌లో పేలుడు సంభవించింది. భారీ శబ్దానికి వినియోగదారులు పరుగులు తీశారు. ఈ ఘటనలో ముగ్గురు హోటల్ సిబ్బందికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను మిగతా .. 2లో..

### ఆనాడు వైకాపా ఎమ్మెల్సీతో
## పోలీసులు కుమ్మక్కయ్యారు

### సుప్రీంకోర్టు ఆగ్రహం



దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ : వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ హత్య కేసులో దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ఈకేసును విచారించింది. నవంబర్ 18లోపు విచారణ పూర్తి చేయాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. ఆనాడు ఎమ్మెల్సీ అనంతబాబుతో మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# నాలెడ్జ్, క్రియేటర్ ఎకానమీ కేంద్రంగా ఏపీ

సౌదీ ఆరామ్ కో ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చలు జరిపారు. ఏపీలో తమ కార్యకలాపాలను విస్తరించాలని సౌదీ ఆరామ్ కోను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. గ్రీన్ ఎనర్జీ ఉత్పాదనకు ఏపీ అత్యంత అనువైన ప్రాంతమని ముఖ్యమంత్రి వివరించారు. డౌన్ స్ట్రీమ్ పరిశ్రమలతో సహా సమగ్రమైన ఎకో సిస్టమ్ నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందని వెల్లడించారు. ప్రముఖ టెక్ కంపెనీ ఆడోబ్ సిస్టమ్స్ సీఈఓ శాంతను నారాయణ్ తో ముఖ్యమంత్రి చర్చలు జరిపారు. ఏపీని నాలెడ్జి హబ్ గా మార్చడమే తన లక్ష్యమని ఏపీలో క్వాంటం కంప్యూటింగ్, డేటా సెంటర్లు, డ్రోన్, స్పేస్ సిటీల ఏర్పాటుపై దృష్టి పెట్టామని ముఖ్యమంత్రి వివరించారు. రియల్ టైమ్ గవర్నెన్స్, పర్సనలైజ్డ్ మెడిసిన్ వంటి అంశాలపై భవిష్యత్ కార్యాచరణను సీఎం ప్రస్తావించారు. వచ్చే 25 ఏళ్లపాటు దేశానికి, రాష్ట్రానికి అతిపెద్ద వనరుగా యువశక్తి మారనుందని సీఎం వివరించారు. క్రియేటర్ ఎకానమీని పెద్ద ఎత్తున ప్రోత్సహించడానికి సహకారం అందించాలని అన్నారు. విద్యార్థులు, నిపుణులకు మరింత నైపుణ్యాలను అందించేలా ప్రత్యేకంగా క్రియేటర్ సాఫ్ట్ వేర్ ను అందించనున్నట్టు శాంతను నారాయణ్ తెలిపారు. ఏఐ లివింగ్ ల్యాబ్స్ తో పాటు పౌరసేవల డిజిటలైజేషన్ అంశంపై కూడా ఇరువురి మధ్యా చర్చ జరిగింది.

**ఏఐ లివింగ్ ల్యాబ్స్‌తో నైపుణ్యం పెంపు**

ఆంధ్రప్రదేశ్‌లో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటు కోసం ఎన్విడియా సంస్థ సహకారం అందించాలని ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ కాలిస్టారెడ్మెండ్ కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఆ సంస్థ ప్రతినిధుల బృందంతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువతను ప్రోత్సహించేందుకు భాగస్వామ్యం వహించాలని కోరారు. అలాగే ఐఐటీ తిరుపతి, ఐఐఎస్ఈఆర్ తిరుపతితో కలిసి ఏపీ ఫస్ట్ అనే వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని... ఈ ప్రాజెక్టులో భాగస్వామి కావాలన్నారు. ఏపీలో డిజైన్ ఇంజనీరింగ్ సొల్యూషన్స్ కోసం ఏపీలో జీసీసీ అభివృద్ధి చేయాలని ఆటోడెస్క్ సీఈఓ మైక్ హేలీని ముఖ్యమంత్రి కోరారు. క్వాంటం టెక్నాలజికి అనుగుణంగా అమరావతిలో ఇన్నోవేషన్ అకాడెమీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ లెర్నింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేసి పాఠశాల విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సహకారం అందించాలని లెగో ఎడ్యుకేషన్ వైస్ ప్రెసిడెంట్ టామ్ హాల్ ను ముఖ్యమంత్రి కోరారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ తో కలిసి నూతన ఆవిష్కరణలను తీసుకురావటంతో పాటు విశాఖలో లెగోల్యాండ్ కల్చరల్ ఎక్స్ పీరియన్స్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని అన్నారు. ఏపీలో పౌరసేవలతో పాటు స్మార్ట్ గవర్నెన్సు అంశాల్లో ఏఐ సొల్యూషన్స్ అందించే అంశంపై క్వాంటెలా ఇంక్ చైర్మన్ శ్రీధర్ గధితో ముఖ్యమంత్రి చర్చలు జరిపారు. వరల్డ్ బ్యాంక్ గ్రూప్ డిజిటల్ ఏఐ రీజినల్ డైరెక్టర్ మహేష్ ఉత్తమ్ చందాని కూడా ముఖ్యమంత్రితో సమావేశం అయ్యారు.

**సమ్మిట్‌లో ఏఐ సాంకేతికతను పరిశీలించిన సీఎం**

పారిశ్రామిక వేత్తలతో భేటీ అనంతరం భారత్ మండపంలో ఏర్పాటు చేసిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్లోని వివిధ స్టాళ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు. ఎన్విడియా, నేయసా, టాటా, ఇంటెల్, మైక్రోసాఫ్ట్ సహా వివిధ సంస్థలు ఏర్పాటు చేసిన ప్రదర్శనను సీఎం ఆసక్తిగా తిలకించారు. వ్యవసాయం, వైద్యారోగ్యం, పరిశ్రమలు తదితర రంగాల్లో ఏఐ వినియోగం, వస్తున్న ఫలితాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏఐ సమ్మిట్లో టాటా సంస్థ ఏపీలో అమలు చేస్తున్న డిజిటల్ హెల్త్ రికార్డుల కార్యక్రమం సంజీవని, డిజిటల్ నెర్వ్ సెంటర్ ను ప్రదర్శించింది. రోబోటిక్స్, ఏఐ డ్రివెన్ సేవలకు సంబంధించిన యూజ్ కేసెస్ ను సీఎం ఆసక్తిగా తెలుసుకున్నారు.

# 11 మంది అరెస్టు

గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో పట్టుబడిన బాలుడిని అరెస్టు చేయకుండా కౌన్సిలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. వీరి వద్ద నుంచి 4,750 గ్రాముల గంజాయి, 8 మొబైల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ఇంకా ఎంతమంది ప్రమేయం ఉందో ఆరా తీస్తున్నామని చెప్పారు. గణేశ్ డ్యాన్స్ టీచర్‌గా అవతారం ఎత్తి పలువురితో పరిచయాలు పెంచుకొని.. గంజాయి వారికి చేరవేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. కళాశాలలో చదువుతున్న యువత, వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు కూడా అందజేస్తున్నట్లు పోలీసు దర్యాప్తులో తేలినట్లు సమాచారం. వీటన్నింటిపై సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నామని డీఎస్పీ భవ్యరెడ్డి తెలిపారు.

# త్వరలోనే పరిష్కారం

చేసేలా అధికారాల బదలాయింపు చేస్తున్నామన్నారు. జాబితా నుంచి ప్రైవేట్ భూములను తొలగించే అధికారం ఆర్డీవోలకు అప్పగించినట్లు వివరించారు. "భూములను 22ఏలో చేర్చాలంటే రిజిస్టర్డ్ పోస్ట్, ఈ కేవైసీ ద్వారా నోటీసులు ఇవ్వాలి. కచ్చితమైన విచారణ చేసి, సరైన కారణాలతో ఉత్తర్వులు ఇవ్వాలి. పదేళ్ల క్రితం కేటాయించిన ఇళ్ల స్థలాలకు పూర్తి హక్కులు ఇస్తున్నాం. ఇనాం భూములపై జీవోఎం త్వరలోనే పరిష్కారం చూపిస్తుంది. రికార్డులు ట్యాంపర్ చేసేందుకు వీల్లేకుండా చర్యలు చేపట్టాం" అని అనగాని వివరించారు.

# దాని వెనుక రూ.కోట్ల బంగారం

గ్రూప్ కార్యాలయాల్లో సోదాలు జరిగాయి. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ప్రముఖ ఫుడ్ అండ్ బెవరేజ్ సంస్థ కన్హా గ్రూప్‌పై పన్ను ఎగవేత ఆరోపణలు రావడంతో మూడు రోజులుగా ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. మొత్తం ఆరు నగరాల్లో ఉన్న 33 ప్రాంతాల్లో బుధవారం నుంచి తనిఖీలు జరుగుతున్నాయి. తొలి రెండు రోజుల్లో గ్రూప్ యజమాని ఇల్లు, ఆఫీస్‌లో అనుమానాస్పద దస్త్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇక మూడో రోజు సోదాల్లో వారికి సీక్రెట్ వాల్ కనిపించింది. దానిని బద్దలుకొట్టి చూడగా.. వెనక ఒక రూమ్ ఉంది. దానిలో కోట్లు విలువచేసే బంగారు నగలు ఉన్నాయి. ఇప్పుడు ఆ మొత్తాన్ని లెక్కిస్తున్నారు. భారీగా వెలుగుచూసిన ఈ సంపద దర్యాప్తు తీరునే మార్చి వేయనుందని అధికారులు పేర్కొన్నారు. ఇది కేవలం పన్ను ఎగవేత కిందికే రాదని, ప్రభుత్వం కళ్లు గప్పి సంపదను దాచి పెట్టడానికి చేసిన పక్కా ప్లాన్ అని వెల్లడించారు. బంగారంతో పాటు రూ.50లక్షల మేర నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ గ్రూప్‌నకు చెందిన పది బ్యాంక్ లాకర్లు బయటపడ్డాయి. వాటిలో కూడా లెక్కలోకి రాని నగదు, బంగారం ఉండొచ్చని భావిస్తున్నారు. 2008లో ఈ కన్హా గ్రూప్‌ను నట్వర్‌లాల్ స్థాపించారు. ఈ సంస్థ స్వీట్స్, బేకరీ ఉత్పత్తులను విక్రయిస్తోంది. దీని యజమానులు రూ.100 కోట్ల వరకు పన్ను ఎగవేతకు పాల్పడి, ఆ మొత్తాన్ని లగ్జరీ హోటళ్లలో పెట్టుబడి పెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆ హోటళ్లలోనూ ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల వేళ కూడా ఈ గ్రూప్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. కస్టమర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశంతో వాటిని కొనసాగించేందుకు అధికారులు అనుమతించారు.

# ట్రంప్ టారిఫ్‌లు చట్టవిరుద్ధం

విధించారని సుప్రీం కోర్టు పేర్కొంది. సుంకాలు సహా పన్నులు విధించే అధికారం పార్లమెంటుకే ఉందని రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేసింది. పన్నులు విధించే అధికారం ఏ కార్యనిర్వాహక విభాగానికీ అప్పగించలేదని చీఫ్ జస్టిస్ పేర్కొన్నారు. సుంకాలను కీలకమైన ఆర్థిక, విదేశాంగ విధానంగా ట్రంప్ ఉపయోగించుకున్నారని వ్యాఖ్యానించారు.

**రిఫండ్లపై రాని క్లారిటీ!**

ప్రభుత్వం ఇప్పటివరకు వసూలు చేసిన సుమారు 133 బిలియన్ డాలర్ల (సుమారు రూ.11 లక్షల కోట్లు) సుంకాలను తిరిగి చెల్లించాలా? వద్దా? అనే అంశంపై మాత్రం సుప్రీంకోర్టు ప్రస్తుతానికి ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేదు. దీనిపై దిగువ కోర్టులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని సమాచారం. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టాక చైనా, మెక్సికో, కెనడాతో పాటు భారత్, బ్రెజిల్ వంటి దేశాల నుంచి వచ్చే దిగుమతులపై 10% నుంచి 50% వరకు, కొన్ని సందర్భాల్లో అయితే 145% వరకు సుంకాలు విధించారు. దీనివల్ల వస్తువుల ధరలు పెరిగి సామాన్యులపై భారం పడుతుందని చిన్న వ్యాపారులు కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ట్రంప్ ప్రభుత్వ ఆర్థిక ఎజెండాకు పెద్ద ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. అయితే, స్టీల్, అల్యూమినియం వంటి కొన్ని నిర్దిష్ట రంగాలపై విధించిన సుంకాలు ఈ తీర్పు పరిధిలోకి రాకపోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

**స్పందించిన ట్రంప్..**

పలు రాష్ట్రాల గవర్నర్లతో ట్రంప్ సమావేశమైన సమయంలోనే ఈ తీర్పు వచ్చినట్లు సమాచారం. సుప్రీంకోర్టు తీర్పు అవమానకరమైనదిగా ట్రంప్ అభివర్ణించినట్లు తెలుస్తోంది. ఈ తీర్పు సమయంలో దాదాపు 20 రాష్ట్రాల గవర్నర్లతో ఆయన భేటీ అయినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

**సానుకూలంగా స్టాక్ మార్కెట్లు**

సుంకాలకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టు తీర్పు అక్కడి స్టాక్ మార్కెట్లలో జోష్ నింపింది. తీర్పు వెలువడిన కొన్ని నిమిషాల్లోనే సూచీలు పాజిటివ్‌గా స్పందిస్తున్నాయి.

# సీబీఐ కోర్టు కీలక ఆదేశాలు

తెనాలిలో మతపరమైన ఆచారాలతో అంత్యక్రియలు నిర్వహించాలని, అందుకు అవసరమైన వసతులు, భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. మొత్తం ప్రక్రియను ప్రభుత్వ అధికారుల సమక్షంలో వీడియో రికార్డింగ్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి సీబీఐ దాఖలు చేసిన తుది నివేదికను న్యాయస్థానం తాజాగా ఆమోదించింది. దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు ఆయేషా మీరా మృతదేహానికి రెండోసారి పోస్టుమార్టం నిర్వహించారు. గాంధీ ఆస్పత్రి వైద్యుల అభిప్రాయం తీసుకున్న అనంతరం అవశేషాలను సీబీఐ కోర్టు ముందుంచారు. మరోవైపు తమ కుమార్తె శరీర అవశేషాలను అప్పగించాలని కోరుతూ తల్లిదండ్రులు శంషాద్ బేగం, సయ్యద్ ఇక్బాల్ బాషా సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం తల్లిదండ్రుల విజ్ఞప్తిని అంగీకరించి ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని మహిళల వసతి గృహంలో 2007లో బి.ఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్యకు గురైన సంగతి తెలిసిందే.

# బౌద్ధ సర్క్యూట్ అభివృద్ధికి పెద్దపీట

65 ప్రాంతాల్లో, విభజన తర్వాత పురావస్తు శాఖ 3 ప్రధాన ప్రాంతాల్లో ఫీల్డ్ సీజన్ లో పురావస్తు శాఖ తవ్వకాలు జరిపిందని మంత్రి దుర్గేష్ తెలిపారు. 2014-15, 2015-16లో జరిపిన తవ్వకాల్లో కాకినాడ జిల్లా ఎ.కొత్తపల్లి (పెద్దమెట్ట) బౌద్ధ క్షేత్రంలో మహాస్థూపాలు,8 ఓటివ్ స్థూపాలు (చిన్న స్థూపాలు), విహారాలు(నివాస ప్రాంతాలు), ఎర్రమట్టి పాత్రలు బయటపడ్డాయని.. అలాగే పోలవరం ప్రాజెక్టు పూర్తయితే తవ్వకాలు జరపడం కష్టమని భావించి పోలవరం ముంపు ప్రాంతాలైన రుద్రమకోట, రాయనపేటలలో 2017-18 లో తవ్వకాలు జరపగా క్రీ.పూ. 1000-300 నాటి ప్రాచీన మానవుడి సమాధులు (మెగా లిథిక్స్), ఇనుప వస్తువులు, మట్టి పాత్రలు లభ్యమయ్యాయని వివరించారు. తద్వారా ప్రాచీన మానవుడి కాలం నాటి సంస్కృతి, అనుసరించిన విధానాలు గుర్తించామన్నారు. ఈ తవ్వకాలకు ప్రత్యేక బడ్జెట్ అంటూ ఏమీ లేదని పోలవరం ప్రాజెక్టులో భాగంగా పురావస్తు శాఖ ఎక్స్ కవేషన్ బడ్జెట్‌లో నుండి వినియోగించి తవ్వకాలు జరిపామని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పదేళ్లుగా ఉన్న ఏపీ పురావస్తు సంపదను తీసుకురావాలని, రాష్ట్ర విభజనకు ముందు జరిపిన తవ్వకాల నివేదికను రాష్ట్ర ప్రజల ముందుంచాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ మంత్రి దుర్గేష్ ను కోరారు. తెలంగాణలో ఉండిపోయిన ఏపీ పురావస్తు సంపదను తిరిగి రప్పించే విషయమై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో ఇప్పటికే ప్రాథమిక చర్చలు జరిగాయని, హైదరాబాద్ లో ఒకసారి సమావేశం కూడా జరిగినట్లు వివరణనిచ్చారు. త్వరలోనే ఇరు రాష్ట్రాల అధికారుల సమన్వయంతో దీనిని పూర్తి చేస్తామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అడిగిన విధంగా పురావస్తు శాఖ ద్వారా మరిన్ని తవ్వకాలు చేపట్టం, దొరికిన అవశేషాలను నిక్షిప్తం చేయడం, సంబంధిత అంశాలను గ్రంథస్తం చేయడం వాటిని ప్రజల సందర్శనార్థం మ్యూజియంలో పెట్టడం అవశ్యకమని భావిస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. 154 పోస్టులకు గాను 54 మంది సిబ్బంది ఉన్నారని సిబ్బంది కొరతను తీర్చాలని కోరారు. కళింగుల రాజధానిగా కీర్తిపొందిన శ్రీకాకుళం జిల్లా దంతపురం, విజయనగరం జిల్లా గుడివాడకొండలలో రాబోయే రోజుల్లో తవ్వకాలు చేపడతామని మంత్రి దుర్గేష్ ప్రకటించారు. పురావస్తు శాఖలో సిబ్బంది కొరతను తీర్చడం, తవ్వకాల్లో దొరికిన అవశేషాలను భద్రపరిచి మ్యూజియాల్లో ప్రదర్శనకు ఉంచడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. హైదరాబాద్ లోని మ్యూజియం మాత్రమే కాక ఏలూరులోని మ్యూజియం, రాజమహేంద్రవరంలోని రాళ్ల బండి సుబ్బరావు మ్యూజియంలకు ప్రత్యేక చరిత్ర ఉందని ఆయా మ్యూజియాల్లో సంబంధిత నివేదికలు పొందుపరిచేందుకు అవకాశం ఉందన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కే.కే. రంగారావు(బేబీ నాయన) అడిగినట్లుగా చిత్రకోట బౌద్ధక్షేత్రం అంశం తమ పరిగణలో ఉందన్నారు. ఏపీలో బౌద్ధమత వ్యాప్తికి నిలయాలైన అమరావతి, నాగార్జునకొండ, ఘంటసాల, ఆదుర్రు, తొట్లకొండ, బావికొండ, చిత్రకోట వంటి ప్రాంతాలను కలిపి 'బౌద్ధ సర్క్యూట్'గా అభివృద్ధి చేస్తామని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సహకారంతో, కేంద్ర బడ్జెట్ కేటాయింపులను ఉపయోగించుకుని అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. గతేడాది కేంద్ర ప్రభుత్వ అనుమతితో వియత్నాంలో బుద్ధుడి పవిత్ర అవశేషాల (హోలీ రిలిక్స్) ప్రదర్శనలో కేంద్రమంత్రి రిజిజుతో పాల్గొన్న అనుభవాన్ని మంత్రి దుర్గేష్ గుర్తుచేసుకుంటూ.. ప్రపంచవ్యాప్తంగా బుద్ధుడి బోధనలకు ఉన్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని ఏపీలోని బౌద్ధ క్షేత్రాలను తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. నాడు వియత్నాంలో బుద్ధుడి అవశేషాల ప్రదర్శనలో అక్కడి భక్తుల భక్తిని చూస్తే ఆశ్చర్యమేసిందని, ఆ సమయంలో ప్రతి ఒక్కరూ సాష్టాంగ నమస్కారం చేయడం గొప్పగా అనిపించిందన్నారు. గడిచిన పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా బుద్ధుడు పుట్టి, పెరిగి, సంచరించిన ప్రాంతాలను ఒక సర్క్యూట్ గా, బౌద్ధ మత వ్యాప్తి జరిగిన ప్రాంతాలను ఒక సర్క్యూట్ గా చేస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రకటించారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఏపీలో బౌద్ధమత వ్యాప్తి జరిగిన బౌద్ధ క్షేత్రాలను సర్క్యూట్‌గా చేయాలని ఇప్పటికే టూరిజం శాఖ, పురావస్తు శాఖ సంయుక్తంగా కేంద్రాన్ని కోరిందని, తాము కేంద్రానికి పంపిన ప్రతిపాదనలకు ఆమోదం లభించిన వెంటనే బుద్ధిస్ట్ సర్క్యూట్‌లకు సంబంధించిన అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి దుర్గేష్ సభకు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు మాట్లాడుతూ.. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక అంశాలపై మండలి బుద్ధ ప్రసాద్ కు ఉన్న శ్రద్ధను, మంత్రి కందుల దుర్గేష్ ఆసక్తిని అభినందించారు. కేంద్రం నుండి నిధుల సాధన కోసం తామంతా కలిసి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

# వార్ రూమ్ ఏర్పాటు చేయాలి

ఎన్నో అవకాశాలు ఉన్నాయి. వాటిని భారత్ అందిపుచ్చుకోవాలి. ఏఐలో స్టార్టప్‌లను ప్రోత్సహించాలి. ప్రతి ఆరు నెలలకోసారి హైదరాబాద్ వంటి ప్రదేశంలో ఏఐ సదస్సులు జరగాలి" అని రేవంత్ అన్నారు. ప్రపంచంలోని టెక్నాలజీ దిగ్గజాలన్నీ ఈ సదస్సుకు వచ్చాయని, ఆలోచనలే మన జీవితాలను మార్చివేస్తాయని చెప్పారు. మనిషి అత్యున్నత ఆవిష్కరణ అయిన ఏఐ ఫలితాలు మన కోసం చూస్తున్నాయి. మనిషి కంటే ఏఐకి ఎక్కువ తెలివితేటలు ఉన్నాయి" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

# మెరుగైన సౌకర్యాలు

దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. త్వరలో పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు ప్రకటించనున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేయాల్సిన ఏర్పాట్లపై తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో అధికారులతో సమీక్షించారు. అనంతరం వెంకయ్య చౌదరి మాట్లాడుతూ.. "గత రెండు, మూడు సంవత్సరాల వేసవి డేటాను విశ్లేషిస్తున్నాం. దర్శనాల సంఖ్య, వేచి ఉండే సమయం, తర్వాత రోజు దర్శనాలకు క్యూలైన్లలో వేచి ఉండే భక్తుల సంఖ్య వంటి అంశాలపై దృష్టి సారించాం. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అన్నప్రసాదం, తాగునీటి పంపిణీ, నడక దారి భక్తులకు మార్గమధ్యంలో షెడ్ల ఏర్పాటు, మాడ వీధులు, అవసరం ఉన్న చోట్ల కూల్ పెయింటింగ్ వేయడం, మజ్జిగ పంపిణీ పాయింట్ల సంఖ్యను పెంచి వేసవిలో భక్తుల దాహార్తిని తీర్చేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. వేసవి సెలవుల్లో కుటుంబాలతో కలిసి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున వసతి సదుపాయాలు, అన్నప్రసాదం పంపిణీ నిర్వహణను మరింత సమర్థంగా అమలు చేయాలని నిర్ణయించాం. నడకదారి భక్తులు, అధిక రద్దీ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలను బలోపేతం చేసి మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాం. సామాన్య భక్తులు దర్శనం కోసం వేచి ఉండే సమయాన్ని తగ్గించి వీలైనంత త్వరగా దర్శనం కలిగేలా చర్యలు తీసుకుంటాం. ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా టెక్నాలజీ వినియోగాన్ని మరింత పెంచి.. గంటల వారీగా ఇన్ అండ్ అవుట్ ఫ్లో, వేచి ఉండే సమయాన్ని ప్రతి నిమిషం పర్యవేక్షిస్తాం. అవసరమైన చోట తక్షణ నిర్ణయాలు తీసుకుంటాం. వివిధ కేటగిరీల దర్శనాలను డేటా ఆధారంగా.. కంపార్ట్‌మెంట్లు, క్యూ లైన్లలో భక్తులు వేగంగా దర్శనం పొందేలా చర్యలు తీసుకుంటాం. వేసవిలో భక్తులకు వేగవంతమైన, సౌకర్యవంతంగా దర్శనం కల్పించడమే లక్ష్యంగా తితిదేలోని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తాయి" అని తెలిపారు.

# వైకాపా సర్వనాశనం చేసింది

చర్చలో ఆయన మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం.. విద్యుత్ వ్యవస్థను సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. గత ప్రభుత్వం ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై రూ.30వేల కోట్ల భారం వేసిందన్నారు. "రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో పెట్టుబడిదారులను గత వైకాపా ప్రభుత్వం రాష్ట్రం నుంచి తరిమికొట్టింది. అప్పుల్లో ఉన్న విద్యుత్ వ్యవస్థను మా ప్రభుత్వం గాడిలో పెడుతోంది. దేశంలో తొలిసారి 13 పైసలు ట్రూడౌన్ చేసిన ఘనత మా ప్రభుత్వానిదే. ఇంటిగ్రేటెడ్ క్లీన్‌ఎనర్జీ పాలసీ ద్వారా 160 గిగావాట్ల విద్యుదుత్పత్తి మా లక్ష్యం. ఆక్వా రైతులకు రూ.1.5కే యూనిట్ విద్యుత్ ఇస్తున్నాం. యూనిట్ కొనుగోలు ధరను రూ.6.35కు తగ్గించి రూ.340 కోట్లు ఆదా చేశాం. ఎస్సీ, ఎస్టీలకు పూర్తి రాయితీతో పీఎం సూర్యఘర్ అమలు చేస్తున్నాం" అని మంత్రి గొట్టిపాటి సభకు వివరించారు.

# వార్ రూమ్ ఏర్పాటు చేయాలి

ఎక్స్‌లో తాజాగా ఓ వీడియోను పోస్టు చేశారు. చెప్పులు, బూట్లు వేసుకొని దేవుడి ఫొటో పట్టుకెళ్లిన ఫొటోలు, వీడియోను విడుదల చేశారు. "మీకు దేవుడంటే భక్తి, భయం లేదు. హిందువుల మనోభావాలంటే లెక్కే లేదు. బూట్లు, చెప్పులతో వేంకటేశ్వరస్వామి చిత్రపటాలను పట్టుకొని మహాపరాధం చేశారు. కౌన్సిల్‌లో ప్రదర్శించిన శ్రీవారి ఫొటోలు అక్కడే విసిరేసి వెళ్లడం క్షమించరాని పాపం" అని లోకేశ్ మండిపడ్డారు. ఏపీ శాసనమండలిలో ఇవాళ ఉదయం గందరగోళ పరిస్థితి నెలకొన్న సంగతి తెలిసిందే. హెరిటేజ్ సంస్థకు అనుబంధంగా ఉన్న ఇందాపూర్ డెయిరీ ద్వారా తితిదేకు నెయ్యి సరఫరాపై చర్చించాలని వైకాపా సభ్యులు రవిబాబు, తూమాటి మాధవరావు, మంగమ్మ ఇచ్చిన వాయిదా తీర్మానాలను మండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు తిరస్కరించారు. దీంతో సభలో వైకాపా ఎమ్మెల్సీలు ఆందోళనకు దిగారు. వేంకటేశ్వర స్వామి ఫొటోలు, ప్లకార్డులు పట్టుకుని పోడియం చుట్టుముట్టి ఆందోళనకు దిగారు. సభా కార్యకలాపాలను అడ్డుకున్నారు. వైకాపా ఎమ్మెల్సీలు చెప్పులు, బూట్లు వేసుకుని దేవుని ఫొటో పట్టుకుని నిరసన చేశారు. వైకాపా ఎమ్మెల్సీలు చెప్పులు, బూట్లు వేసుకుని దేవుడి ఫొటోతో నిరసన తెలపడంపై అధికార పక్ష సభ్యుల తీవ్ర అభ్యంతరం తెలిపారు.

# ఏపీలో క్రైమ్ రేటు 6 శాతం తగ్గింది

డిమాండ్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సందర్భంగా ఆమె మాట్లాడారు. సైబర్ నేరాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. వైసీపీ కార్యకర్తలు రప్పా రప్పా అంటూ రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకోబోమని మంత్రి అనిత హెచ్చరించారు. రాష్ట్రాభివృద్ధికి లా అండ్ ఆర్డర్ చాలా ముఖ్యమని, అది లేకనే గత ప్రభుత్వంలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో లా అండ్ ఆర్డర్ చక్కగా పనిచేయడం వల్లే క్రైమ్ రేట్ తగ్గిందన్నారు. అందుకే దేశంలోనే ఎక్కువ పెట్టుబడులు సాధించిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో మహిళలు బయటకు రావడానికి కూడా భయపడేవాళ్లు అని, చట్టబద్ధత లేని దిశా యాప్ పేరుతో ప్రజలను మోసం చేశారన్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి పాలనలో కూటమి ప్రభుత్వం మహిళల రక్షణకు కట్టుబడి ఉందన్నారు. శక్తి యాప్, శక్తి టీమ్స్ తో మహిళా రక్షణకు కృషి చేస్తున్నామని చెప్పారు. అందుకే రాష్ట్రంలో మహిళలపై నేరాలు 4.4 శాతం తగ్గాయని స్పష్టం చేసారు. తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని, గీత దాటితే కటకటాలే అని హెచ్చరించారు. సైబర్ క్రైమ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ లు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలకు వివిధ కార్యక్రమాలు ద్వారా అవగాహన కల్పిస్తున్నాం అన్నారు.

# కఠిన చర్యలు తీసుకోవాలి : కూటమి నేతలు

సభ్యులు హిందువుల మనోభావాలు దెబ్బతీశారని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ధ్వజమెత్తారు. హిందూ మతాన్ని రెచ్చగొట్టేలా వైకాపా ప్రవర్తించిందని మండిపడ్డారు. హద్దులు దాటి ప్రవర్తించి దేవదేవుడు పట్ల మహాపచారానికి పాల్పడ్డారని విమర్శించారు. ప్రతిపక్ష ఎమ్మెల్సీలు ప్రవర్తించిన తీరు ఎంతో కలచివేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవుడిని రాజకీయాల్లోకి లాగటం తగదన్నారు. సంయమనం పాటించే కొద్దీ రెచ్చగొడుతున్నారని.. హిందువుల పట్ల వైకాపా విధానం ఇదేనా అని నిలదీశారు. వెంకటేశ్వర స్వామి పట్ల తమ పార్టీ విధానం ఇదేనని జగన్ చెప్తున్నారా..? అని ప్రశ్నించారు. హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పేవరకు విషయాన్ని వదిలిపెట్టమని హెచ్చరించారు.

**జగన్ డైరెక్షన్‌లోనే.. కందుల దుర్గేష్**

జగన్ డైరెక్షన్‌లోనే వైకాపా ఎమ్మెల్సీలు స్వామి వారిని తీవ్రంగా అవమానించారని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మండిపడ్డారు. జనసేన ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. వెంకటేశ్వరస్వామి చిత్ర పటాన్ని నిర్లక్ష్యంగా విసిరేయడం తేలిగ్గా తీసుకునే విషయం కాదని ధ్వజమెత్తారు.

**జగన్ క్షమాపణలు చెప్పాలి.. సోము వీర్రాజు**

జాతి క్షమించరాని నేరానికి వైకాపా సభ్యులు, జగన్ పాల్పడ్డారని భాజపా ఎమ్మెల్సీ సోము వీర్రాజు దుయ్యబట్టారు. సభ వాయిదా పడగానే వెంకటేశ్వరస్వామి చిత్రపటాలను ప్లకార్డులతో పాటు విసిరేసి వెళ్లారని ఆయన ఆరోపించారు. భారతజాతికి జగన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వెంకటేశ్వరస్వామి అంటే ఇంత చులకన భావమేంటని మండిపడ్డారు.

# ఎల్బీనగర్ చట్నీస్ హోటల్‌లో పేలుడు

ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇడ్లీ స్టీమర్‌లో పేలుడు సంభవించినట్లు తెలుస్తోంది. సమాచారం తెలుసుకున్న ఎల్బీనగర్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అధిక వేడిమి కారణంగానే స్టీమర్ పేలిపోయినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. పోలీసులు, హైడ్రా సిబ్బంది, బాంబు స్క్వాడ్ బృందాలు పేలుడు సంభవించిన కిచెన్‌ను పరిశీలించాయి. ఇడ్లీ స్టీమర్ వేడెక్కడంతోనే పేలుడు సంభవించిందా? ఇంకేమైనా కారణాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# పోలీసులు కుమ్మక్కయ్యారు

పోలీసులు కుమ్మక్కయ్యారని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. డిఫాల్ట్ బెయిల్ వచ్చేలోగా ఛార్జిషీట్ దాఖలు చేశారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అప్పట్లో తప్పుచేసిన పోలీసులపై ప్రస్తుత ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించింది. డీజీపీ, ఎస్పీలు ఏం చేస్తున్నారని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం నిలదీసింది. కేసు ట్రయల్ కోసం హైకోర్టు సీనియర్ న్యాయాధికారిని నియమించాలని ఆదేశించింది. రోజువారీ విచారణ జరిగిలా చూడాలని పేర్కొంది. మార్చి 31లోపు ప్రత్యేక జ్యుడిషియల్ అధికారిని నియమించాలని హైకోర్టుకు సూచించింది. హైకోర్టు ఈ కేసులో జోక్యం చేసుకుని అడ్డంకులు సృష్టించవద్దని పేర్కొంది. నిందితుడితో పోలీసులు ఇప్పటికీ చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతున్నట్లుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి దర్యాప్తు చేయడం రాకపోతే సీబీఐకి కేసును అప్పగించాల్సి వస్తుందని సీజేఐ హెచ్చరించారు.

## ఎడిటర్ వాయిస్

# రాజ్యసభ రేసులోకి నల్లారి?

ఉమ్మడి ఏపీకి చివరి సీఎంగా పనిచేసిన రికార్డు ఆయన సొంతం. ఏకంగా మూడున్నరేళ్ళ పాటు ముఖ్యమంత్రిత్వం వహించారు. ఆయనే ఉమ్మడి చిత్తూరు జిల్లాకి చెందిన నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి. సీఎం అయితే చిన్న వయసులో అయ్యారు. కానీ ఆ తరువాతనే ఆయన రాజకీయం సరిగ్గా సాగడంలేదు అని అంటున్నారు. 2014 నుంచి చూస్తే ఇప్పటిదాకా పుష్కర కాలంగా నల్లారి వారు చట్ట సభలలోకి అడుగుపెట్టలేకపోయారు. ఆయన బీజేపీ కాంగ్రెస్ బీజేపీ ఇలా మారుతూ వచ్చినా కూడా రాజకీయ సుడి మాత్రం తిరగడం లేదు. లేకపోతే 2024 ఎన్నికల్లో ఏపీలో కూటమి వీర విహారం చేసిన స్థితిలో సైతం ఆయన లోక్ సభకు ఎంపీ కాలేకపోయారు. రాజంపేట నుంచి ఆయన కనుక గెలిచి ఉంటే ఈపాటికి కేంద్ర మంత్రిగా నిక్షేపంగా కీలక స్థానంలో ఉండేవారు అని అనుచరులు ఆవేదన చెందుతూంటారు.

**కేంద్ర రాజకీయాల్లోనే :**

ఇదిలా ఉంటే నల్లారి వారి చూపు కేంద్ర రాజకీయాల మీదనే ఉంది అని అంటున్నారు. ఉమ్మడి ఏపీకి సీఎం గా చేసిన ఆయనకు విభజన ఏపీలో తగిన హోదాతో పదవి అయిప ఉండదనే చెప్పాలి. అందుకే ఆయన అయితే రాజ్యసభకు వెళ్ళాలని లేదా రాజ్ భవన్ వైపు అయినా చూడాలని ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. 2024 ఏడాదిలో ఏపీ నుంచి రాజ్యసభకు నాలుగు సీట్లు ఖాళీ అయ్యాయి. అందులో రెండు బీజేపీకి దక్కాయి. ఒకటి బీసీ నేత ఆర్ క్రిష్ణయ్య మళ్ళీ తానే రెన్యూల్ అయి వెళ్లారు. రెండవది చూస్తే గోదావరి జిల్లాలకు చెందిన ఒక సీనియర్ బీజేపీ నేతకు దక్కింది. ఈ సీటు కోసం అప్పట్లో నల్లారి వారు ప్రయత్నం చేశారు అని కూడా ప్రచారం సాగింది.

**ఈసారి గురి తప్పదా :** ఇక ఈసారి మరో నాలుగు రాజ్యసభ సీట్లు ఏపీ కోటాలో ఖాళీ అవుతున్నాయి. అందులో బీజేపీ వాటాగా ఒక సీటు లభిస్తోంది. ఈ సీటు కోసం పోటీ జాతీయ స్థాయి నుంచి కూడా ఉంది. అయితే ముఖ్యమంత్రిగా పనిచేసిన వారుగా రాయలసీమలో ప్రధానమైన సామాజిక వర్గానికి చెందిన కీలక నేతగా ఉన్న నల్లారి కి ఈ సీటు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రచారం సాగుతోంది. రాయలసీమ అంటే వైసీపీకి బలం ఉన్న ప్రాంతంగా ఉంది. అక్కడ రెడ్లను ఆకరిషించే క్రమంలో బీజేపీ కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో పేరున్న నేత రాజకీయ కుటుంబానికి చెందిన వారు మాజీ సీఎం అయిన నల్లారిని పెద్దల సభకు పంపడం ద్వారా ఉభయ తారకంగా ఉంటుందని ఒక ఆలోచన అయితే ఉందిట.

**గట్టి పోటీయే కానీ :** ఇక చూస్తే రాజ్యసభ రేసులో బీజేపీ నుంచి గట్టి పోటీయే ఉంది అని అంటున్నారు. అయితే ఈ పోటీలో కూడా ఏపీకి చెందిన వారికే టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. జాతీయ స్థాయిలో ఎవరినో దిగుమతి చేయడం వల్ల ఉపయోగం లేదని అంటున్నారు. కానీ కమలనాథుల ఆలోచనలు ఎపుడూ ఆశ్చర్యకరంగా ఉంటాయి. అనూహ్యమైన అభ్యర్థిని వారు బరిలోకి దింపుతారు. కానీ నల్లారి వారు మాత్రం తీవ్రంగానే ప్రయత్నాలు చేస్తున్నారు అని అంటున్నారు. ఆయనకు టికెట్ ఇవ్వడం మీద ఏపీలో టీడీపీ కూటమి పెద్దలకు సైతం అభ్యంతరాలు లేవని అంటున్నారు. అయితే బీజేపీ కేంద్ర పెద్దల ఆలోచనలే తెలియాల్సి ఉంది అని అంటున్నారు. బీజేపీలో మొదటి నుంచి ఉంటూ ఆర్ ఎస్ ఎస్ నేపథ్యం ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తారా లేక రాజకీయ ప్రయోజనాలను చూసుకుని సీమలో కీలక నేతగా ఉన్న నల్లారిని పెద్దల సభకు పంపుతారా అన్నది చూడాల్సి ఉంది అని అంటున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## రీల్స్ చూసి చిరునామా కనుక్కున్నాడు..

**తలుపు కోసేందుకు రంపం తెచ్చుకున్నాడు**

**వనస్థలిపురంలో సునీత హత్యోదంతంలో కీలక విషయాలు వెలుగులోకి...**



**నిందితుడు మహేశ్‌ను వైద్య పరీక్షలకు తీసుకెళ్తున్న పోలీసులు, హతురాలు సునీత**

హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : తనతోపాటు కుటుంబ సభ్యులపై గృహహింస కేసు పెట్టిందనే కక్ష, మరొకర్ని వివాహం చేసుకుందనే అసూయతో మాజీ భార్యను అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఎట్టిపరిస్థితుల్లోనూ చంపేందుకు కత్తితోపాటు విద్యుత్ రంపం తెచ్చుకుని... పక్కా ప్రణాళికతో హత్య చేశాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేసిన రీల్స్‌లో కనిపించిన ఆలయం ఆధారంగా ఆమె ఉంటున్న ప్రాంతాన్ని కనిపెట్టి దారుణానికి ఒడిగట్టాడు. హైదరాబాద్ వనస్థలిపురంలో బుధవారం జరిగిన గర్భిణి హత్యోదంతంలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసుల కథనం ప్రకారం...

**ప్రేమ..పెళ్లి..కేసులు :** పెద్దపల్లి జిల్లా మంథని మండలం విలోచవరం గ్రామానికి చెందిన దేవరకొండ మహేశ్ 2019-22 వరకు ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేసి, కెనడా వెళ్లాడు. మహారాష్ట్రలోని చంద్రపురి జిల్లా బల్లార్పూర్ మండలం తిలక్‌వాడ్‌కి చెందిన సునీత(30)తో... అతనికి 2014 నుంచి పరిచయముంది. మహేశ్ సొంతూరు, సునీత అమ్మమ్మ గ్రామం ఒక్కటే కావడంతో ఇద్దరి మధ్య పరిచయం..ప్రేమగా మారింది. 2022 ఏప్రిల్‌లో పెళ్లి చేసుకున్నారు. సునీతకు వీసా రాకపోవడంతో మహేశ్ ఒక్కడే కెనడా వెళ్లాడు. అక్కడికెళ్లాక ఫోన్‌కాల్స్‌కు స్పందించకపోవడంతో భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఈ కారణంగా గొడవలు జరుగుతున్న సమయంలోనే సునీత 2023 అక్టోబరులో కెనడా వెళ్లింది. గొడవలు మరింత పెరగడంతో కొన్ని నెలలకే స్వదేశానికి తిరిగొచ్చిన సునీత... మహారాష్ట్రలోని బల్లార్పూర్ ఠాణాలో భర్తపై గృహహింస కేసు పెట్టింది. ఈ కేసులో మహేశ్, అతని తల్లిదండ్రులు నిందితులుగా ఉన్నారు.

**ఆలయం పేరు ఆధారంతో గాలిస్తూ... :** తల్లి మరణం, లుక్‌ఔట్ నోటీసుల కారణంగా వీసా నిరాకరణకు గురవడం తదితర పరిణామాలకు సునీత కారణమని భావించిన మహేశ్ ఆమెపై కక్ష పెంచుకున్నాడు. ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేసిన రీల్స్ చూసి గతేడాది ఏప్రిల్‌లో ఆమె మరొకర్ని వివాహం చేసుకున్నట్లు తెలుసుకుని మరింత రగిలిపోయాడు. ఇటీవల ఓ గుడి వద్ద ఉన్న ఫొటోను ఆమె అప్‌లోడ్ చేయడంతో ఆలయం వనస్థలిపురంలో ఉన్నట్లు నిర్ధారించుకున్నాడు. వనస్థలిపురంలోని వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ.. చివరకు గ్రీన్‌సిటీ కాలనీలో సునీత ఉంటున్న అపార్టుమెంటును కనిపెట్టాడు. మూడు రోజుల క్రితం రెక్కీ నిర్వహించి..బుధవారం మధ్యాహ్నం నేరుగా ఇంట్లో చొరబడి ఆమెను అంతమొందించాడు.

**ఎవరైనా అడ్డుకుంటే... :** నిందితుడి వద్ద ఉన్న సంచిలో పెద్ద కత్తి, రెండు విద్యుత్ రంపాలు, పెట్రోలు డబ్బా ఉన్నట్లు గుర్తించారు. అవెందుకని ప్రశ్నించగా.. 'సునీత నన్ను చూశాక భయపడి తలుపులు వేసుకుంటే... వాటిని కోసైనా లోపలికి వెళ్లాలనే ఉద్దేశంతో రంపాలను తెచ్చుకున్నా. ఇతరులెవరైనా అడ్డగిస్తే..వారిని బెదిరించేందుకు పెట్రోలు తెచ్చుకున్నా" అని నిందితుడు చెప్పినట్లు సమాచారం. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించామని ఎల్బీనగర్ డీసీపీ అనురాధ, ఇన్‌స్పెక్టర్ మహేశ్ గురువారం తెలిపారు.

## ప్రేమను కాదంటోందని సుత్తితో దాడి

**సూర్యాపేట జిల్లాలో ప్రేమోన్మాది ఘాతుకం - బాధితురాలి పరిస్థితి విషమం**



**చివ్వెంల, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రేమించిన యువతి దూరం పెడుతోందని ఓ యువకుడు ఉన్మాదిగా మారాడు. ఆమె తలపై సుత్తితో విచక్షణారహితంగా దాడిచేసి హత్యకు ప్రయత్నించాడు. సూర్యాపేట జిల్లాలో గురువారం ఈ దారుణం చోటుచేసుకుంది. ప్రస్తుతం యువతి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం అలుగునూరుకు చెందిన స్వప్న హైదరాబాద్‌లో ఎల్ఎల్‌బీ చదువుతున్నారు. ఇదే మండలం లింగంపల్లికి చెందిన బోయిండ్ల మహేశ్ హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ చదువుకుంటున్నాడు. ఎనిమిదేళ్ల క్రితం ఏర్పడిన వీరి పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరిదీ ఒకే సామాజికవర్గం కావడంతో పెళ్లి చేసుకోవాలని యువకుడు నిశ్చయించుకున్నాడు. వీరి ప్రేమ విషయం యువతి తల్లిదండ్రులకు తెలిసి వ్యతిరేకించారు. పెద్ద మనుషుల సమక్షంలోనూ పంచాయితీ పెట్టి దూరంగా ఉండాలన్నారు. ఈ క్రమంలో కొద్దిరోజులుగా స్వప్న మాట్లాడటం లేదని మహేశ్ ద్వేషం పెంచుకున్నాడు. తన ప్రేమను కాదన్నందున అంతమొందించాలని పన్నాగం పన్నాడు. సూర్యాపేట పరిధిలోని స్నేహనగర్(చివ్వెంల మండలం)లో ఉంటున్న సోదరి ఇంటికి స్వప్న రెండు రోజుల క్రితం వచ్చిన విషయం తెలుసుకున్న మహేశ్ గురువారం ఉదయం అక్కడికి వెళ్లి ఆమెతో వాగ్వాదానికి దిగాడు. సుత్తితో స్వప్న తలపై కొట్టాడు. ఆర్తనాదాలు వేస్తూ రక్తపు మడుగులో పడిపోగా... మహేశ్‌ను స్థానికులు పట్టుకొని స్తంభానికి కట్టి దేహశుద్ధి చేశారు. యువతిని సూర్యాపేట ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతోహైదరాబాద్‌కు తరలించారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

**మద్యం తాగించి..**

## 8వ తరగతి బాలికపై ముగ్గురి అత్యాచారం



**నిందితుల్లో ఇద్దరు మైనర్లు**

**నార్సింగి, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ శివారు నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో అమానవీయ ఘటన చోటు చేసుకుంది. 8వ తరగతి బాలికకు ఒక పాత నేరస్థుడు, ఇద్దరు బాలురు మద్యం తాగించి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. శేరిలింగంపల్లి డీసీపీ చింతమనేని శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో ఈ వివరాలు వెల్లడించారు. పుప్పాలగూడకు చెందిన బాలిక(15) 8వ తరగతి చదువుతోంది. ఈ నెల 7న చార్మినార్ వద్ద షాపింగ్‌కు వెళ్లిన సమయంలో అక్కడ ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేసే బాలుడు(16) పరిచయం చేసుకొని ఫోన్ నంబర్ తీసుకున్నాడు. తరువాత రోజూ ఫోన్ చేసి మాట్లాడుతూ మళ్లీ కలుద్దామని కోరాడు. ఈ నెల 16న స్కూల్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పిన బాలిక చార్మినార్ వెళ్లింది. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన బాలిక తల్లి నార్సింగి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ప్రత్యేక బృందాలతో వివిధ ప్రాంతాల్లో వెతికారు. సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో చెంగిచెర్లలో బాలిక ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థిని తన దగ్గరకు రావడాన్ని అవకాశంగా తీసుకున్న బాలుడు తన స్నేహితులైన పాతబస్తీ రెయిన్‌బజార్‌కు చెందిన ఆటోడ్రైవరు ఇమ్రాన్‌ఖాన్ అలియాస్ షిషి(24), తలాబ్‌కట్టకు చెందిన బాలుడిని పిలిపించాడు. బాలికను చార్మినార్ పరిసర ప్రాంతాల్లో తిప్పి అర్ధరాత్రి తర్వాత నగర శివారు చెంగిచెర్లలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం దగ్గరికి తీసుకెళ్లారు. ముగ్గురూ మద్యం తాగి, బాలికతోనూ బలవంతంగా తాగించారు. మత్తులో ఉండగా కత్తితో బెదిరించి ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు విచారణలో పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలంలో బాలికతోపాటు ఉన్న ఓ బాలుడు, ఇమ్రాన్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

**8 కేసుల్లో నిందితుడు**

ఇమ్రాన్‌ఖాన్ దోపిడీ, దొంగతనం, భౌతికదాడులు సహా ఎనిమిది కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. మరో బాలుడు పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

## నెల్లూరులో క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు

**నెల్లూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టయింది. ఇందుకు సంబంధించి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన వేణు, వెంకటరమణను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.34.6 లక్షల నగదు, ల్యాప్‌టాప్, టీవీ, ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారి ఖాతాల్లో ఉన్న రూ.1.64 కోట్లు సీజ్ చేశారు. త్వరలోనే క్రికెట్ బెట్టింగ్ ముఠా నిర్వాహకులను పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు.

**భూ తగాదాలు.. కాంగ్రెస్ నాయకుడి**

## దారుణ హత్య



**దుబ్బాక, విశ్వం వాయిస్ న్యూస్ :** సిద్దిపేటలో కాంగ్రెస్ నాయకుడు దారుణ హత్యకు గురయ్యారు. భూ తగాదాల నేపథ్యంలో బాల్‌రెడ్డి (50) అనే వ్యక్తిని దాయాదులు హత్య చేశారు. దుబ్బాక పురపాలికలోని చేల్లాపూర్ వార్డు శివారులో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చేల్లాపూర్ వార్డుకు చెందిన వంగ బాల్‌రెడ్డిని అదే గ్రామానికి చెందిన దాయాదులు భూ తగాదాల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం దారుణంగా గొంతు కోసి చంపారు. అనంతరం నిందితులు తల్లి, కొడుకు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. పోలీసులు సంఘటన స్థలికి చేరుకొని క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం దుబ్బాక వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు అనంతరం హత్యకు సంబంధించిన వివరాలు తెలియజేస్తామని ఏసీపీ తెలిపారు.

## హోలీ రోజునే సుదీర్ఘ చంద్రగ్రహణం..

**మార్చి3న హోలీ పండగ జరుపుకోవచ్చా?**



హోలీ పండుగ రోజున చంద్రగ్రహణం ప్రభావం ఉంటుందా.. హోలీ జరుపుకోవచ్చా..? ఏ సమయంలో హోలీ జరుపుకోవాలి? అనేది ఇపుడు అందరిలోనూ ఆశక్తిగా మారింది. ఎందుకంటే.. ఈ సంవత్సరం మార్చి 3న సంవత్సరంలోనే అత్యంత దీర్ఘమైన గ్రహణం ఏర్పడనుంది. మధ్యాహ్నం నుంచే సూతక కాలం ప్రారంభం కానుంది.. మార్చి 3న భారతదేశంలో చంద్రగ్రహణం కనిపించనుంది. భారత కాలమానం ప్రకారం ఈ గ్రహణం మార్చి 3న మధ్యాహ్నం 3 గంటల 19 నిమిషాలకు ప్రారంభమై సాయంత్రం 6 గంటల 46 నిమిషాలకు ముగుస్తుంది. ఈ విధంగా గ్రహణం మొత్తం వ్యవధి సుమారు 3 గంటలు 19 నిమిషాలు ఉంటుంది. బింబ దర్శనకాలం 59 నిముషాలు ఉంటుందని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పంచారామక్షేత్రం శ్రీ ఉమాసోమేశ్వర జనార్ధనస్వామి ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి రామకృష్ణ శర్మ అంటున్నారు. మార్చి 3న హోలీ రోజు ఈ సంవత్సరంలో మొదటి చంద్రగ్రహణం పడనుంది. ఇది సంవత్సరంలోనే అత్యంత దీర్ఘమైన గ్రహణంగా భావిస్తున్నారు. హిందూ పంచాంగం ప్రకారం మార్చి 3న మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు చంద్రగ్రహణం కొనసాగుతుంది. కాబట్టి ఉదయం 11 గంటలలోపు హోలీ జరుపుకోవాలని రామకృష్ణ శర్మ సూచిస్తున్నారు. చంద్రగ్రహణం సందర్భంగా ఉదయం 9 గంటలకే ఆలయాలను మూసివేయాలని అంటున్నారు. సూతక కాలంలో పూజలు, ఆరాధనలు, విగ్రహాలను తాకడం, కొత్త పనులు ప్రారంభించడం, శుభకార్యాలు చేయడం మంచిది కాదని నమ్మకం. అదేవిధంగా భోజనం చేయకూడదని, ప్రయాణాలు చేయకూడదని, దేవాలయాలకు వెళ్లకూడదని కూడా చెబుతారు. గర్భిణీలు, చిన్నపిల్లలు, రోగులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తారు. భారతదేశంలో ఈ చంద్రగ్రహణం దేశంలోని కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తుంది. ముఖ్యంగా బెంగాల్ ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాలు, అలాగే పశ్చిమ బెంగాల్‌లో స్పష్టంగా కనిపించే అవకాశం ఉంది. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో కూడా కొంతవరకు కనిపించవచ్చు. భారతదేశం బయట పాకిస్తాన్, అఫ్ఘనిస్తాన్, ఇరాక్, ఇరాన్ వంటి దేశాల్లో కూడా ఈ గ్రహణం కనిపించనుంది.

## కాశీ ఘాట్‌ల నుంచి గంగా జలం తెచ్చుకోవచ్చా?..




గంగా జలాన్ని ఇంటికి తెస్తున్నారా?.. ముందు ఇవి తెలుసుకోండి..

కాశీ యాత్రకు వెళ్ళిన ప్రతి భక్తుడు గంగా మాతను దర్శించుకుని, ఆ పవిత్ర జలాన్ని వెంట తెచ్చుకోవాలని ఆరాటపడతారు. అయితే, గంగా జలాన్ని ఇంటికి తెచ్చుకోవచ్చా? తెచ్చుకుంటే దాన్ని ఎలా నిల్వ చేయాలి? ఇంట్లో గంగా జలం ఉంటే కలిగే శుభ ఫలితాలు ఏంటి? అనే ఆసక్తికర విషయాలను గురించి ఈ ప్రత్యేక విశ్లేషణలో తెలుసుకోండి. భారతీయ సంస్కృతిలో గంగానదికి ఉన్న ప్రాముఖ్యత వర్ణనాతీతం. కాశీ ఘాట్ ల నుంచి గంగా జలాన్ని తెచ్చుకోవడం పుణ్యప్రదమని భక్తులు నమ్ముతారు. కానీ, ఆ పవిత్ర జలాన్ని ఇంటికి తెచ్చేటప్పుడు, భద్రపరిచేటప్పుడు కొన్ని ఆధ్యాత్మిక నియమాలను పాటించడం వల్ల పూర్తి ఫలితం లభిస్తుంది.

**కాశీ నుంచి గంగా జలం తెచ్చుకోవచ్చా?**

ఖచ్చితంగా తెచ్చుకోవచ్చు! శాస్త్రాల ప్రకారం గంగా జలం ఎప్పటికీ పాడవ్వదు. కాశీలో విశ్వేశ్వరుని పాదాలను తాకి వచ్చే ఈ జలాన్ని ఇంట్లో ఉంచుకోవడం వల్ల ప్రతికూల శక్తులు నశిస్తాయి. అయితే, గంగా జలాన్ని సేకరించేటప్పుడు పవిత్రమైన మనస్సుతో, గంగా మాతను ప్రార్థిస్తూ సేకరించాలి.

**ప్లాస్టిక్ పాత్రలు వద్దు**

చాలామంది కాశీ ఘాట్ల వద్ద దొరికే ప్లాస్టిక్ బాటిల్స్‌లో నీటిని తెస్తారు. అయితే ప్లాస్టిక్ అనేది అపవిత్రంగా భావించబడుతుంది. ఇంటికి తెచ్చిన తర్వాత ఆ జలాన్ని వెంటనే రాగి లేదా ఇత్తడి పాత్రలోకి మార్చడం మంచిది. లోహ పాత్రల్లో గంగా జలాన్ని ఉంచడం వల్ల దాని శక్తి మరింత పెరుగుతుంది.

**సర్వదోష నివారిణి**

ఇంట్లో గంగా జలం ఉండటం వల్ల వాస్తు దోషాలు తొలగిపోతాయి. ఏదైనా శుభకార్యం జరిగేటప్పుడు లేదా గ్రహణ సమయం తర్వాత ఇంటిని గంగా జలంతో శుద్ధి చేయడం వల్ల సానుకూల శక్తి ప్రసరిస్తుంది. చనిపోయే సమయంలో గంగా జలాన్ని నోట్లో పోయడం వల్ల మోక్షం లభిస్తుందని హిందూ ధర్మం చెబుతోంది.

**ఎప్పుడు వాడాలి?**

రోజూ పూజ సమయంలో గంగా జలాన్ని అభిషేకానికి వాడవచ్చు. ఏదైనా క్లిష్ట పరిస్థితిలో ఉన్నప్పుడు లేదా మనస్సు ఆందోళనగా ఉన్నప్పుడు కొద్దిగా గంగా జలాన్ని ప్రోక్షించుకోవడం వల్ల మనశ్శాంతి లభిస్తుంది.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

శనివారం, 21 ఫిబ్రవరి 2026




www.viswamvoice.com

# సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో జిల్లా ఎస్పీ భేటీ

## సైబర్ నేరాల నియంత్రణే లక్ష్యం - రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు - జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపిఎస్ హెచ్చరిక

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపిఎస్ శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం, సైబర్ నేరాల అదుపు, శాంతిభద్రతల పరిరక్షణపై ఇన్‌ఫ్లుయెన్సర్లతో సుదీర్ఘంగా చర్చించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు లేదా వీడియోలు వైరల్ చేసి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ నేరాల పట్ల సామాన్య ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా 30 40 సెకన్ల నిడివి గల అవగాహన వీడియోలను రూపొందించాలని నిర్ణయించారు. సైబర్



మోసాలపై ప్రభావవంతమైన లఘు చిత్రాలు నిర్మించి ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. జిల్లా సోషల్ మీడియా సెల్ రూపొందించే వీడియోలు, పాంప్లేట్లను ఇన్‌ఫ్లుయెన్సర్లు తమ పేజీల్లో విరివిగా పంచుకోవాలని కోరారు. విపత్తుల సమయంలో లేదా ఇతర ప్రాంతాల్లో జరిగిన సంఘటనలను జిల్లాకు ఆపాదిస్తూ తప్పుడు ప్రచారాలు చేయవద్దని సూచించారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే పోస్టులను అరికడుతూ జిల్లా పోలీస్ విభాగం అందించే వాస్తవ సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పోలీసులకు మరియు ఇన్‌ఫ్లుయెన్సర్లకు మధ్య నిరంతర సమన్వయం కోసం ప్రత్యేక సోషల్ మీడియా గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల ద్వారా గంజాయి విక్రయాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సోషల్ మీడియాను సమాజ హితం కోసం ప్రభావవంతంగా వినియోగించాలనే దానిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ఇన్‌ఫ్లుయెన్సర్ల సహకారంతో సైబర్ నేరాలను సమర్థవంతంగా నియంత్రించి జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా సిఐ తమ్మి నాయుడు బోనంగి, జిల్లాలోని ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు పాల్గొన్నారు.

### గంజాయితో పట్టుబడిన

# నలుగురు యువకులు

## నిందితులలో మైనర్ యువకుడు

## గంజాయి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్పై షరీఫ్



**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** నలుగురు యువకులు గంజాయితో పట్టుబడిన ఘటన దేవీపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలవరం జిల్లా ఇంచార్జి ఎస్పీ ఆదేశాల మేరకు డిఎస్పీ ఉత్తర్వుల ప్రకారం దేవీపట్నం మండలం పోతవరం గ్రామ శివారులో శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలపై గంజాయి తరలిస్తున్న నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్పై షరీఫ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలం లోని పాత దండంగి నుండి ఇందుకూరుపేట వైపు నలుగురు వ్యక్తులు పంపన కృష్ణబాబు (24),గెద్దాడ మణికంఠ (23),గుబ్బాల ఈశ్వర్ రాం గణేష్ (18).తో పాటు మైనర్ బాలుడు రెండు ప్లాస్టిక్ సంచులలో రూ.1,50,000 విలువ చేసే 30కేజీల గంజాయి తరలిస్తుండగా వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి గంజాయి రవాణాకు ఉపయోగించిన రెండు ద్విచక్ర వాహనాలను రెండు ఆండ్రాయిడ్ ఫోన్ లను తీసుకొని రెవిన్యూ అధికారుల ఆధ్వర్యంలో పంచానామా నిర్వహించి వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపించడం జరిగింది అని ఎస్పై తెలిపారు.గంజాయి రవాణాపై జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగింది అని ఎవరైనా గంజాయి అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పై షరీఫ్ తెలిపారు.

# ఇలాంటి శివలింగం దేశంలో ఎక్కడా లేదు..

### మన ఏపీలో.. నవపాషాణాలతో..




తిరుపతి సమీపంలోని గుడిమల్లం పరశురామేశ్వరాలయం శతాబ్దాల చరిత్ర కలిగిన అరుదైన ఆలయం. ఇక్కడ పురుషాకారాన్ని పోలిన విశిష్టమైన శివలింగం పూజలందుకుంటోంది, ఇది భారతదేశంలో మరెక్కడా కనిపించదు. క్రీస్తుపూర్వం 2వ-3వ శతాబ్దం నాటిదిగా పురావస్తు శాఖ అంచనా వేస్తున్న ఈ ఆలయం.. మౌర్య, తొలి బౌద్ధ, శాతవాహన కాలాల నాటి ఆధారాలను కలిగి ఉంది. తిరుపతి సమీపంలోని రేణిగుంట మండలం గుడిమల్లం గ్రామంలో ఉన్న పరశురామేశ్వర ఆలయం భారతదేశంలోని ప్రాచీన ఆలయాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయంలో కొలువై ఉన్న శివలింగం పురుషాకారాన్ని తలపించేలా ఉండటం దీని విశిష్టత. నవపాషాణాలతో అంటే తొమ్మిది రకాల పదార్థాలతో నిర్మితమైన ఈ అరుదైన శిల్పం భారతదేశంలో మరెక్కడా కనిపించదని పురావస్తు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆర్కియలాజికల్ అధ్యయనాల ప్రకారం, కొందరు ఇది భూమికి సంబంధించినది కాదని, ఉల్కాపాతం పడినప్పుడు దానితో ఏర్పడిన లింగం అని వాదిస్తున్నారు. అయితే ఈ వాదనలకు శాస్త్రీయ నిరూపణ ఇంకా జరగవలసి ఉంది. ఏదేమైనా, ఈ లింగం ప్రత్యేకత దాని ప్రాముఖ్యతను మరింత పెంచుతుంది. క్రీస్తుపూర్వం రెండవ లేదా మూడవ శతాబ్దం నాటికే ఈ ఆలయ నిర్మాణం జరిగి ఉంటుందని భారత పురావస్తు శాఖ అంచనా వేశారు. సుదీర్ఘకాలంగా భారత పురావస్తు శాఖ పర్యవేక్షణలో ఉన్న ఈ ఆలయంలో 2009 వరకు పూజా కార్యక్రమాలకు అనుమతి లేదు. నిర్మాణానికి హాని కలగని విధంగా పూజలు నిర్వహించేందుకు అనుమతించిన తరువాత భక్తుల రాకపోకలు పెరిగాయి. ఆలయ నిర్వహణ బాధ్యతలను దేవదాయ శాఖ చూసుకుంటోంది. ఆలయ అధికారుల వివరాల ప్రకారం... పరశురాముడే ఈ విశిష్ట శివలింగాన్ని ప్రతిష్టించాడని భక్తులు విశ్వసిస్తారు. ఇక్కడ పూజలు చేయడం వల్ల పెళ్లికాని వారికి వివాహం జరుగుతుందని, సంతానం లేని వారికి సంతానం కలుగుతుందని ప్రబల నమ్మకం ఉంది. సువర్ణముఖి నదికి సమీపంలో ఉంది ఈ ఆలయం. ప్రస్తుతం నదీ ప్రవాహం తగ్గుతున్నప్పటికీ, ఒకప్పుడు వరదల సమయంలో నదీ జలాలు ఆలయంలోకి ప్రవేశించి శివలింగాన్ని తాకేలా నిర్మించిన ఏర్పాటు ఇప్పటికీ చెక్కుచెదరలేదని అధికారులు తెలిపారు. ఆలయం పల్లంలో ఉండటం వల్లనే దీనికి గుడిపల్లెం అనే పేరు వచ్చిందని, కాలక్రమేణా అది గుడిమల్లంగా మారిందని కొందరు చరిత్రకారులు చెబుతున్నారు. ఈ ఆలయంలోని ఏడు అడుగుల శివలింగంపై తలపాగా, దోవతి ధరించిన రుద్రుని రూపం కనిపిస్తుంది. ఒక చేతిలో పశువును, మరో చేతిలో గొర్రెను పట్టుకుని యక్షుని భుజాలపై నిలబడిన ఈ రుద్రుడి వస్త్రధారణ ఋగ్వేద కాలం నాటిదని అంచనా వేస్తున్నారు. 1954లో భారత పురావస్తు శాఖ ఈ కట్టడాన్ని తమ పరిధిలోకి తీసుకుంది. అంతకుముందు 1911లోనే గోపీనాథరావు అనే పురావస్తు శాస్త్రవేత్త ఈ ఆలయంపై ఏడాదిపాటు పరిశోధనలు చేశారు. 1908 నాటి బ్రిటిష్ గెజిట్లలో కూడా ఈ ఆలయం గురించి ప్రస్తావన ఉంది. ప్రస్తుత గోపురం తవ్వకాల్లో లభించిన శాసనాల ఆధారంగా, 12వ శతాబ్దంలో విక్రమచోళుడి కాలంలో దీనిని పునర్నిర్మించి ఉండవచ్చని ఒక అంచనా ఉంది. చోళుల తర్వాత పల్లవ, గంగపల్లవ, రాయల కాలాల్లో కూడా ఈ ఆలయంలో పూజాధికాలు సాగినట్లు చరిత్రకారులు పేర్కొన్నారు. 1970లో జరిగిన త్రవ్వకాలలో ఈ శివలింగం కింద మౌర్యుల కాలం నాటి నాణేలు, ఇటుకలు, నలుపు మెరిసే పాత్రలు లభించాయి. శివలింగం చుట్టూ ఉన్న చిన్న రైలింగ్‌పై తొలి బౌద్ధ కాలపు ఆనవాళ్లు కూడా గుర్తించారు. ఆంధ్ర శాతవాహనుల కాలంనాటి కట్టడంగానూ ఈ ఆలయాన్ని భావిస్తారు. ఉజ్జయినిలో దొరికిన రాగి నాణేలపై ఈ అంగాన్ని పోలిన బొమ్మ లభించిందని, మధుర మ్యూజియంలో కూడా ఇలాంటి శిల్పం ఒకటుందని కొన్ని పుస్తకాల్లో పేర్కొన్నారు. ఆనంద కుమారస్వామి, జితేంద్రనాథ్ బెనర్జీ వంటి అంతర్జాతీయ పురావస్తువేత్తలు కూడా ఈ శివలింగాన్ని తమ రచనల్లో ప్రస్తావించారు. ఆదిశివలింగంగా ప్రసిద్ధి చెందిన గుడిమల్లం పరశురామేశ్వర ఆలయం భారతదేశంలోని అత్యంత ప్రాచీన శివాలయాలలో ఒకటి. దాదాపు 2200 ఏళ్ల క్రితమే దీని ఉనికి చాలామంది చరిత్రకారులు నిర్ధారిస్తున్నారు. దీని నిర్మాణ విశిష్టత అంతర్జాతీయ పరిశోధకులను ఆకర్షిస్తోంది. భక్తుల సంఖ్య పెరుగుతుండగా, 2026 ఏప్రిల్ 23న ఆలయంలో.. మహా కుంభాభిషేకం నిర్వహించనున్నారు.

### రోడ్డు ప్రమాద బాధితుడికి

# రికార్డు స్థాయిలో పరిహారం..

### ఏకంగా రూ.2.95 కోట్లు చెల్లించాలని కోర్టు తీర్పు!



కర్నూలుకు చెందిన టీడీపీ సీనియర్ నేత ఎదురూరు రాజవర్ధన్ రెడ్డి 2022 ఏప్రిల్ 20న హైదరాబాదు నుంచి కర్నూలుకు ఫార్చ్యూనర్ కారులో వస్తుండగా మహబూబ్నగర్ జిల్లాలోని ఉండవల్లి దగ్గర రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. దీంతో మృతుడి భార్య పులకుర్తి సౌజన్య, తండ్రి విష్ణువర్ధన్ రెడ్డి ఉండవల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు.. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ నేత కుటుంబానికి రికార్డు స్థాయిలో పరిహారం చెల్లించాలని ఇన్సూరెన్స్ కంపెనీని కర్నూలు కోర్టు ఆదేశించింది. కర్నూలుకు చెందిన టీడీపీ సీనియర్ నేత ఎదురూరు రాజవర్ధన్ రెడ్డి 2022 ఏప్రిల్ 20న హైదరాబాదు నుంచి కర్నూలుకు ఫార్చ్యూనర్ కారులో వస్తుండగా మహబూబ్నగర్ జిల్లాలోని ఉండవల్లి దగ్గర రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. దీంతో మృతుడి భార్య పులకుర్తి సౌజన్య, తండ్రి విష్ణువర్ధన్ రెడ్డి ఉండవల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగినట్లు నిర్ధారించారు. రాజ వర్ధన్ రెడ్డి భార్య పిల్లలు తమ సీనియర్ న్యాయవాది మీా శ్రీనివాసరెడ్డి ద్వారా కర్నూలు జిల్లా కోర్టులో నష్టపరిహారం కోసం కేసు దాఖలు చేశారు. సదరు కారుకు లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా బీమా చేయించి ఉండటంతో వారు ఇన్సూరెన్స్ కంపెనీ నష్టపరిహారం చెల్లించాలని కోర్టును కోరారు. ఈ మేరకు కోర్టు సాక్ష్యధారాలు పరిశీలించి మృతుడి వయస్సు, ఆదాయము, విద్యార్హతలు కుటుంబీకుల స్థితిగతులను పరిగణలోకి తీసుకుని ఆ కంపెనీ మృతుని కుటుం బీకులకు నష్టపరి హారం చెల్లించాల్సిందేనని తీర్పు చెప్పింది. పిటిషనర్లైన మృతుని కుటుంబ సభ్యులకు రూ.2.2 కోట్లు తోపాటు 7.5 శాతం వడ్డీతో సహా మొత్తం రూ.2.95 కోట్లు చెల్లించాలని ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తి లక్ష్మీరాజ్యం తీర్పు చెప్పారు. ఇంత మొత్తంలో పరిహారం రావడం పట్ల మృతుడు రాజ వర్ధన్ రెడ్డి కుటుంబీకులు తమ న్యాయవాది ఎంఎల్ శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మధ్యకాలంలో ఇంత భారీ మొత్తం నష్టపరిహారం చెల్లించమని ఒక భీమా కంపెనీకి కోర్టు ఆదేశించలేదని, ఇదే ప్రధమమని పలువురు న్యాయవాదులు చెబుతున్నారు.

# ‘ఘోస్ట్ ఉద్యోగి’కి.. వేతన రూపంలో రూ.10 కోట్లు

**నేటివార్త :** అమెరికాలో ఓ భారత సంతతి వ్యక్తి చేసిన మోసం వెలుగు చూసింది. తప్పుడు పత్రాలతో తన స్నేహితుడిని నియమించుకొని సంస్థకు 1.2 మిలియన్ డాలర్ల (సుమారు రూ.10 కోట్లు) మేర నష్టం కలిగించినట్లు తేలింది. పని చేయకున్నా వేతనంతోపాటు ఇతర సదుపాయాలు పొందడం గమనార్హం. ‘ఘోస్ట్ ఉద్యోగి’ వ్యవహారంపై దర్యాప్తు జరిపిన న్యాయస్థానం.. అతడు అధికార దుర్వినియోగంతో సంస్థను మోసం చేసినట్లు నిర్ధరించింది. భారత సంతతికి చెందిన కరణ్ గుప్తా.. మిన్నెసోటాలోని యునైటెడ్‌హెల్త్ గ్రూప్ అనుబంధ సంస్థ ‘ఆప్టమ్’లో సీనియర్ డైరెక్టర్‌గా చేశాడు. వార్షిక వేతనం 2.60లక్షల డాలర్ల కంటే ఎక్కువే. ఈ క్రమంలో కొన్నేళ్లక్రితం తన చిరకాల మిత్రుడిని ఆ సంస్థలో చేర్చుకోవాలని భావించాడు. అతడికి అర్హత లేకున్నా తప్పుడు దస్త్రాలు (రెజ్యూమె సహా ఇతర) సృష్టించి 2015లో ఉద్యోగిగా నియమించుకున్నాడు. తన టీమ్‌లోనే పనిచేసేలా కేటాయించుకున్నాడు. అతడి మిత్రుడు సంస్థలో పనిచేయకున్నా ప్రారంభంలో లక్ష డాలర్లకుపైగా వార్షిక వేతనం అందేది. ప్రతి ఏటా జీతం పెంపుతో పాటు బోనస్‌లను కూడా పొందాడు. ఉద్యోగిగా వేతనం పొందుతున్నప్పటికీ ఆ సంస్థలో ఒక్క సహోద్యోగినీ కలవలేదు. ఆయనకు సంబంధించి ఒక్క మెయిల్ లేదు. అసలు అతనికి కేటాయించిన కంప్యూటర్‌లో లాగిన్ కూడా కాలేదు. అయితే, అతడి స్నేహితుడికి వచ్చే జీతంలో సగానికిపైగా గుప్తా ఖాతాలోకి చేరేవి. న్యూజెర్సీలో ఉండే ఆ స్నేహితుడు నగదు విత్‌డ్రా చేసి గుప్తా అకౌంట్‌లో వేసేవాడు. అయితే, 2019 నవంబర్‌లో ఓ మోసం కేసులో గుప్తాను ఆ సంస్థ ఉద్యోగం నుంచి తొలగించింది. అదే సమయంలో ఈ వ్యవహారం బయటపడింది. సంస్థ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన దర్యాప్తు సంస్థలు.. మొత్తంగా దాదాపు 1.2 మిలియన్ డాలర్లు (సుమారు రూ.10 కోట్లు) మోసం చేయడంతోపాటు, మనీలాండరింగ్ కుట్ర ఉన్నట్లు పేర్కొన్నాయి. అధికార దుర్వినియోగానికి పాల్పడిన గుప్తా.. ఘోస్ట్ ఉద్యోగిని నియమించుకొని సంస్థను మోసగించినట్లు న్యాయస్థానం నిర్ధరించింది. ఈ వ్యవహారానికి సంబంధించి న్యాయశాఖ పూర్తి వివరాలు వెల్లడించింది.



# రంజాన్ ఆధ్యాత్మికతకు ప్రతీకగా ఇఫ్తార్ విందు

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం





**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం ఇఫ్తార్ విందులు దేశ సమైక్యతకు, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వంకు దోహదపడతాయని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. పవిత్ర రంజాన్ మాసం రెండో రోజు సందర్భంగా రామచంద్రపురం పట్టణంలోని పెద్ద మసీదులో ఘనంగా నిర్వహించిన ఇఫ్తార్ విందులో వాసంశెట్టి సత్యం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి పాల్గొని, పరస్పర సౌహార్దాన్ని చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు ఎండి నవాబ్, రాయవరం మండల మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్ వలీ, రామచంద్రపురం పట్టణ మైనార్టీ అధ్యక్షుడు షేక్ అహ్మద్ ఆలీషా, మాజీ అధ్యక్షుడు అల్లావుద్దీన్ తదితర ముస్లిం పెద్దలు, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు. సమాజ శాంతి, ఐక్యత, సౌభ్రాతృత్వం నెలకొనాలని అల్లాను ప్రార్థించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రంజాన్ మాసం మనిషిలో నియంత్రణ, సేవాభావం, పరస్పర గౌరవం పెంపొందించే పవిత్ర కాలమని తెలిపారు. మైనార్టీల సంక్షేమం, అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం మాత్రమేనని, అన్ని వర్గాల ప్రజలను సమానంగా అక్కున చేర్చుకుంటుందని ఆయన పేర్కొన్నారు. మత సామరస్యాన్ని బలోపేతం చేసే ఇలాంటి ఇఫ్తార్ విందులు సమాజంలో ఐక్యతను మరింత పటిష్టం చేస్తాయని కార్యక్రమంలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ నారపురెడ్డి బలరాం, క్లస్టర్ ఇంచార్జ్ కంచుమర్తి బాబురావు, ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.


రాజధాని పూర్తి కావాలని

# రావులపాలెం చేరుకున్న మహా సంకల్ప యాత్ర



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజధాని అమరావతి నిర్విఘ్నంగా పూర్తి కావాలని కాకినాడకు చెందిన సీనియర్ న్యాయవాది కెవివిఎస్ యెన్ మూర్తి, టిడిపి నాయకులు, వేణు గోపాల స్వామి ఆలయ ధర్మ కర్త చెరుకూరి శ్రీనివాస చౌదరి, మరో టిడిపి నాయకులు కె.శ్రీనివాస్ పాదయాత్రగా శుక్రవారం రావులపాలెం చేరుకున్నారు. ఈ సందర్భముగా ఆలమూరుకు చెందిన సీనియర్ న్యాయవాది, తెలుగుదేశం ఆవిర్భావం నుంచి అభిమానిగా వున్న గుణ్ణం వీర వెంకట సత్యనారాయణ మూర్తి రావులపాలెం లో వీరికి స్వాగతం పలికి అమరావతి రాజధాని నిర్మాణం నిర్విగ్నిన్గా పూర్తి కావాలని కాకినాడకు చెందిన ముగ్గురు కాకినాడ నుండి తిరుమలకు పాద యాత్రగా వెళుతున్న కాకినాడకు చెందిన సీనియర్ న్యాయవాది కె వివి ఎస్ యెన్ మూర్తి, టిడిపి నాయకులు, వేణు గోపాల స్వామి ఆలయ ధర్మ కర్త చెరుకూరి శ్రీనివాస చౌదరి, మరో టిడిపి నాయకులు కె.శ్రీనివాస్ తదితరులకు రావులపాలెంలో ఘన స్వాగతం పలికి యాత్ర దిగ్విజయంగా జరగాలని తెలిపారు. పాదయాత్ర చేస్తున్న నాయకులు మాట్లాడుతూ గతంలో టిడిపి భారీ మెజారిటీ తో అధికారంలోకి వచ్చిన సందర్భముగా ఇదే విధంగా పాద యాత్ర చేసి స్వామికి మొక్కులు తీర్చుకున్నామని, ఈ విజయం వేంకటేశ్వర స్వామి అనుగ్రహంతో జరిగిందని, అదే విశ్వాసంతో పరిపాలన బావుండాలని, రాజధాని అమరావతి పూర్తి కావాలని పాద యాత్ర ప్రారంభించామన్నారు.

# సోషల్ మీడియా సైబర్ నేరాల నియంత్రణే లక్ష్యం : ఎస్సై జి.సురేంద్ర



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపిఎస్, డి.ఎస్.పి సుంకర మురళీమోహన్, సీఐ విద్యాసాగర్, కొత్తపేట ఎస్సై జి.సురేంద్ర హెచ్చరిక సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం, సైబర్ నేరాల అదుపు మరియు శాంతిభద్రతల పరిరక్షణ సమావేశంలోని ముఖ్యాంశాలు రెచ్చగొట్టే అంశాలపై హెచ్చరిక సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు లేదా వీడియోలు వైరల్ చేసి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.వీడియో కంటెంట్ మరియు అవగాహన సైబర్ నేరాల పట్ల సామాన్య ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా చెయ్యాలి సోషల్ మీడియా సెల్ రూపొందించే వీడియోలు, పాంప్లెట్లను ఇన్ఫ్లుయెన్సర్లు తమ పేజీల్లో విరివిగా షేర్ చేయాలని కోరారు.అసత్య ప్రచారాల అదుపు విపత్తుల సమయంలో లేదా ఇతర ప్రాంతాల్లో జరిగిన సంఘటనలను జిల్లాకు ఆపాదిస్తూ తప్పుడు ప్రచారాలు ల చేయవద్దని సూచించారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే పోస్టులను అరికడుతూ, సమన్వయం కోసం గ్రూప్ ఏర్పాటు పోలీసులకు, ఇన్ఫ్లుయెన్సర్లకు మధ్య నిరంతర సమన్వయం కోసం ఒక ప్రత్యేక సోషల్ మీడియా గ్రూప్‌ను ఏర్పాటు చేశారు.గంజాయి విక్రయాలపై నిఘా ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల ద్వారా గంజాయి విక్రయాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు చేరవేయాలని, అటువంటి వారిపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. భవిష్యత్తు ప్రణాళిక సోషల్ మీడియాను సమాజ హితం కోసం అత్యంత ప్రభావవంతంగా ఎలా ఉపయోగించాలనే దానిపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఇన్ఫ్లుయెన్సర్ల సహకారంతో సైబర్ నేరాలను సమర్థవంతంగా నియంత్రించలని అన్నారు వర్గాల మధ్య విభేదాలు ప్రోత్సహించడం జాతీయ సమగ్రతకు విఘాతం కలిగించడం మత భావాలను దెబ్బతీయాలని ఉద్దేశంతో చర్యలు ప్రజాశాంతికి భంగం కలిగించడం ఎలక్ట్రానిక్ రూపంలో అభ్యంతర కంచెం ప్రసారం సమాచారాన్ని నిర్వహించడం కుల దూషణలు అవమానాలు బెదిరింపులు డిజిటల్ వేదిక ద్వారా ప్రయాణ కుట్ర తదితర చర్యలు వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ లకు బాధ్యతలు గ్రూపులో పోస్ట్ అయ్యే కంటెంట్ను నిరంతరం పర్యవేక్షించాలి వాటిని వెంటనే తొలగించాలి అటువంటి సభ్యులు తొలగించాలి తప్పుడు వార్తలు చిత్రాలు ఎడిట్ చేసిన వీడియోలు పూర్తిగా నిషేధించారు కుల మత భావాలను దెబ్బతీయాలని ఉద్దేశంతో చర్యలు ప్రజాశాంతికి భంగం కలిగించడం ఎలక్ట్రానిక్ రూపంలో అభ్యంతర విషయాలు ప్రసారం సమాచారాన్ని నిర్వహించడం కుల దోషములు పరిమితం చేయాలి సూచనలు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# బీసీ సింహ గర్జనను జయప్రదం చేయండి

### బోడే రామచంద్ర యాదవ్ పిలుపు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదివారం జరగనున్న బీసీ సింహగర్జనను జయప్రదం చేయాలని ఆ సభకు వేలాదిగ బీసీలు తరలి వెళ్లాలని రాష్ట్ర బీసీవై ఎగ్జిక్యూటివ్ మట్ట వీరబాబు గౌడ్ బీసీలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర బీసీ వై అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ పిలుపుమేరకు మంగళగిరి నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా పూలే అంబేద్కర్ ప్రాంగణంలో బీసీ సింహ గర్జన ప్రతిష్టాత్మక నిర్వహించనున్నారన్నారు ముఖ్యంగా ఈ సభలో బీసీలకు రక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని బీసీ కార్పొరేషన్లకు నిధులు వెంటనే కేటాయించాలని కోరనున్నట్టు తెలిపారు అలాగే బీసీ కులగన చేసి నైన్ షెడ్యూల్లో పెట్టి బీసీలకు రిజర్వేషన్ ప్రకటించిన తర్వాతే 44 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆ తర్వాతే స్థానిక సంస్థలు నిర్వహించాలనని సభ ద్వారా కోరనున్నట్లు తెలిపారు.అమరావతి రాజధాని ప్రాంతంలో బీసీలకు 1000 ఎకరాలు భూమి కేటాయించాలని కార్పొరేట్ సంస్థలకు ఏ ధర అయితే ప్రభుత్వం ఇస్తుందో ఆ ప్రకారం బీసీలకు వెయ్యి ఎకరాలు కేటాయించాలని కోరారు ఈ కార్యక్రమానికి బీసీ సంఘం నాయకులు కుల సంఘాల నాయకులు బీసీ యువత బిసి మేధావులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మట్ట వీరబాబు గౌడ్ పిలుపునిచ్చారు.

# బిజెపి జిల్లా ఎస్సీ మోర్చ అధ్యక్షునిగా పొనుగుపాటి శ్రీనివాస్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** బిజెపి జిల్లా ఎస్సీ మోర్చ అధ్యక్షునిగా నియమితులైన బిజెపి సీనియర్ నాయకులు పొనుగుపాటి శ్రీనివాస్ కొత్తపేట బిజెపి నాయకులను కార్యకర్తలను మరియు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందంని కలిశారు. ఈ సందర్భంగా పాలూరి సత్యానందం మరియు బిజెపి నాయకులు పొనుగుపాటి శ్రీనివాస్‌ని దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పాలూరి సత్యానందం మాట్లాడుతూ బిజెపి సీనియర్ నాయకుడిగా పార్టీ అభివృద్ధికి కృషి చేసిన శ్రీనివాస్‌ని ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షునిగా నియమించిన జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణకి మరియు రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కోటిపల్లి సుబ్రహ్మణ్యం, యువ నాయకులు కోటిపల్లి రఘురాం వేణుగోపాల్, ఆరెస్సెస్ బౌద్ధ ప్రముఖ్ తొగరు సీతారామాంజనేయులు, గంగారాం, అంజిబాబు మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రావులపాలెం నుంచి గుణదల మేరీ మాత కొండ వరకు పాదయాత్ర

## వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాలి అలాగే చిర్ల జగ్గిరెడ్డి ఎమ్మెల్యే కావాలన్న లక్ష్యంతో వైఎస్ఆర్‌సీపీ శ్రేణుల పాదయాత్ర



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలంలో రాష్ట్ర ఇంటెలెక్చువల్ విభాగం కార్యదర్శి కొడమంచిలి హరీష్ ఆధ్వర్యంలో, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2029 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, అలాగే కొత్తపేట నియోజకవర్గం నుంచి చిర్ల జగ్గిరెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ ఈ రోజు పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్ర రావులపాలెం నుంచి గుణదల మేరీ మాత కొండ వరకు భక్తి, సంకల్పంతో సాగుతుంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వైఎస్ జగన్ పాలనలో అమలైన సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో తెచ్చిన మార్పును గుర్తు చేస్తూ, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో 2029లో మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అవుతారని, కొత్తపేట నియోజకవర్గంలో చిర్ల జగ్గిరెడ్డి నాయకత్వానికి మరింత బలం చేకూరుతుందని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలుస్తుందని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటం కొనసాగుతుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెదేపా నాయకులు బండారు సంజీవ్

# సీఎం రిలీఫ్ ఫండ్‌తో ప్రజారోగ్యానికి భరోసా



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అర్హులందరికీ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందడానికి ఎమ్మెల్యే బండారు కృషి చేస్తున్నారు. సీఎం రిలీఫ్ ఫండ్‌తో ప్రజారోగ్యానికి భరోసా లభిస్తుందని యువనాయకులు బండారు సంజీవ్ వ్యాఖ్యానించారు. రావులపాలెం క్యాంపు కార్యాలయంలో జరిగిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో బండారు సంజీవ్ పాల్గొని చెక్కులను అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అర్హులందరికీ సీఎం సహాయ నిధి అందేలా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆత్రేయపురం మండలానికి చెందిన 34 మందికి రూ.18,69,502ల విలువైన చెక్కులు, రావులపాలెం మండలానికి చెందిన 44మందికి రూ.20,50,078ల విలువైన చెక్కులు అందించారు. ఇందులో రీయింబర్స్మెంట్ చెక్కులు 77, ఎల్వోసీ 1 కాగా మొత్తం 78మందికి, రూ.39,19,580లు విలువైన చెక్కులు అందజేశారు.

దొంతికుర్రు జెడ్ పి ఎచ్ హై స్కూల్ నందు

# విద్యార్థులుకు సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా, కాట్రేనికోన, దొంతికుర్రు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాట్రేనికోన ఎస్సై అవినాష్ పాల్గొని సైబర్ క్రైమ్స్, రోడ్డు భద్రత, మరియు మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాల గురించి విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు.

**కార్యక్రమంలోని ముఖ్యాంశాలు**

**సైబర్ నేరాలు:** సోషల్ మీడియా వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింక్‌లను క్లిక్ చేయకూడదని, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని ఎస్సై హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే '1930' నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. రోడ్డు భద్రత మైనర్లు వాహనాలు నడపకూడదని, రహదారి నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. హెల్మెట్ ధరించడం మరియు అతివేగాన్ని నియంత్రించుకోవడంపై అవగాహన కల్పించారు. మహిళలు,చిన్నారుల రక్షణ మహిళలు మరియు చిన్నారుల భద్రత కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాల గురించి వివరించారు. ఏదైనా ఆపద కలిగితే '100' లేదా '112' నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. 'గుడ్ టచ్ – బ్యాడ్ టచ్' పట్ల చిన్నారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, పోలీస్ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా

# రాంబాబు పదోన్నతి

### అభినందించిన డిటిఓ డి.శ్రీనివాసరావు



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన రాంబాబును జిల్లా రవాణాధికారి డి.శ్రీనివాసరావు తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పదోన్నతి పొందిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ, కొత్త బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డిటిఓ డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధి, అభ్యున్నతి కోసం కలెక్టర్ ఆదేశాలను కచ్చితంగా అమలు చేస్తూ అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని అన్నారు. గ్రామీణాభివృద్ధి, పేదల సంక్షేమం, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి అంశాల్లో డి.ఆర్.డి.ఎ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం కావాలంటే శాఖల మధ్య సమన్వయం అత్యంత అవసరమని, రవాణా శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని డి.టి.ఓ స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల అమలు విషయంలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవహారం, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రాంబాబు మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తానని, అన్ని విభాగాల సహకారంతో ప్రభుత్వ సంకల్పాలను ప్రజలకు చేరవేస్తానని తెలిపారు. ఈ సమావేశం సానుకూల వాతావరణంలో సాగి, జిల్లా అభివృద్ధి కోసం పరస్పర సహకారంతో ముందుకు సాగాలనే సంకల్పాన్ని వ్యక్తం చేస్తూ ముగిసింది.

ఆత్రేయపురం పోలీస్ స్టేషన్‌లో

# శాంతి భద్రతల సమీక్ష

### జిల్లా ఎస్‌పి రాహుల్ మీనా



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

ఆత్రేయపురం పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం నిర్వహించిన ఈ తనిఖీలో స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితి, నమోదైన కేసుల దర్యాప్తు పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై వివరాలు తెలుసుకుని, దర్యాప్తు వేగవంతం చేయడంతో పాటు చట్టపరమైన విధానాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వాడపల్లి వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు ప్రతి శనివారం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని ఎస్సై రామును ఆదేశించారు. భక్తుల రాకపోకలు సజావుగా సాగేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, చిన్నపిల్లలపై జరుగుతున్న నేరాల అరికట్టేందుకు గ్రామ స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు పోలీస్ సిబ్బంది చురుకుగా వ్యవహరించాలని తెలిపారు. స్టేషన్ సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న ఎస్పీ, సిబ్బంది సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు బాధతో, ఆశతో వస్తారని, వారి పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ ధైర్యం చెప్పి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రావులపాలెం రూరల్ సిఐ విద్యాసాగర్, ఎస్బి సిఐ పుల్లారావు, ఎస్సై రాము, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## సామాజిక తనిఖీకి

# అధికారులు, ప్రజలూ డుమ్మా..!

**ప్రజా ప్రతినిధులు, నేతలు సైతం ముఖం చాటేసారు - ఎంపీడీవో, సచివాలయ కార్యదర్శులూ గైర్హాజరు**
**ఉపాధి హామీ పథకం సిబ్బంది మాత్రమే హాజరు - తెలుగు దేశం నాయకుడు ఒకరే హాజరు**





**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి సంబంధించి గురువారం నిర్వహించిన మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజా వేదికకు అధికారులు, ప్రజలు కూడా డుమ్మా కొట్టారు. కూడబలుక్కున్నట్టు కట్టకట్టుకుని ముఖం చాటేశారు. దీంతో సభా వేదిక మొత్తం మండల ఉపాధి హామీ పథకం, జిల్లా ఉపాధిహామీ పథకం, ప్రజా తనిఖీ నిర్వహణా బృందం అంతా కలిసి 100 మందిలోపు సంఖ్య హాజరుకే పరిమితం అయ్యింది. సభ కళ తప్పింది. కనీసం సామాజిక తనిఖీ దస్త్రాల్లో సంతకాలు చేసేవారు, వేలి ముద్రలు వేసే వారూ లేక ప్రజల హాజరును మినిట్స్ పుస్తకంలో నమోదు చేసే అవకాశమే లేకుండా పోయింది. మండలంలోని 14 పంచాయతీల పరిధిలోని 33 నివాసిత ప్రాంతాల్లో 17 వ విడతగా 01.04.2024 నుండి 31.03.2025 వరకూ ఉపాధిహామీ పథకం, పంచాయతీ రాజ్ శాఖ గ్రామీణ అభివృద్ధిశాఖ రక్షిత తాగునీటి సరఫరా విభాగం, అటవీశాఖ, సామాజిక అటవీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మండలం మొత్తం మీద 866 వివిధ అభివృద్ధి పనులకు మొత్తం రూ. 15,68,06,835 లను ఖర్చు చేసారు. వీటిలో ఉపాధి కూలీలకు రూ. 7,60,81,478 లను వేతనాల చెల్లింపులకు, వివిధ వస్తు సామాగ్రి కొనుగోలుకు రూ. 8,03,13,248 లను వినియోగించారు. ఈ వ్యయంపై ప్రజలకు వివరించేందుకు స్థానిక మండల ప్రజా పరిషత్తు కార్యాలయం ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు నిర్వహించిన ప్రజా వేదికలో ప్రజలు, ఉపాధి హామీ కూలీలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు, ఆహ్వానం అందుకున్న మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సైతం పక్కా ప్రణాళికతో గైర్హాజరు అయ్యారు. సామాజిక తనిఖీ ప్రధాన అధికారిణి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పథకం సంచాలకురాలు అడపా వెంకటలక్ష్మి, సామాజిక తనిఖీ అధికారి, ఆర్థిక అధికారి విజయ్ కుమార్ తోపాటు మరో నలుగురు తనిఖీ అధికారులు, మండల ప్రజా పరిషత్తు అభివృద్ధి అధికారి, మండల ఉపాధిహామీ పథకం అధికారి గుత్తికొండ కిషోర్, ఉప అధికారి ఎన్.వివి.శ్రీనివాస్, సామాజిక తనిఖీ స్టేట్ రిసోర్స్ పర్సన్ ఎస్.లక్ష్మణరావు, జిల్లా రిసోర్స్ పర్సన్లు కడారి కృష్ణ, బద్ది శ్రీనివాస్, నలుగురు సా ఖ౨మాజిక తనిఖీ కార్యకర్తలు, మండల సాంకేతిక సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాస్, ఇద్దరు కానిస్టేబుళు ,, మండల ప్రజా పరిషత్తు సిబ్బంది, గొంధికొత్తపల్లి నుంచి తెలుగు దేశం పార్టీ నాయకుడు ఈగల దేవుడు మాత్రమే హాజరు అయ్యారు. ప్రధానంగా ఏయే ప్రభుత్వ శాఖల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారో ఆయా శాఖలైన సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ, తాగునీటి సరఫరా విభాగం, అటవీశాఖ, సామాజిక అటవీ శాఖల అధికారులతో పాటు పంచాయతీ, సచివాలయాల కార్యదర్శులు అందరూ కూడా గైర్హాజరీ అయ్యారు. దీంతో సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం మొత్తం తనిఖీ శాఖల అధికారులకే పరిమితం అయ్యింది. దీంతో వంటి చేయి తప్పెట్ల సామెత మాదిరిగా సామాజిక తనిఖీ సభా వేదిక మొత్తం వారి కోసం వారే ఏర్పాటు చేసుకున్నట్లు అయ్యింది. దీంతో విసుగు చెందిన సామాజిక తనిఖీ ప్రధాన అధికారిణి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పథకం సంచాలకురాలు అడపా వెంకటలక్ష్మి కల్పించుకుని తనిఖీ బృందం అధికారులను ఉద్దేశించి ఇక ప్రజలు రారు ... వారు ఏమీ అడగరు. మీరు కానీయండని వ్యాఖ్యానించారు. దీంతో ప్రజల కోసం ఎదురు చూపులు చాలించి సామాజిక తనిఖీని ముందుకు కొనసాగించారు. గత ఏడాది 16 విడత సామాజిక తనిఖీ సందర్భంగా నాలుగు ప్రధాన ప్రభుత్వ శాఖల అధికారులు సహాయ నిరాకరణ చేశారు. 1.04.2023 నుంచి 31.03.2024 వరకూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో పంచాయితీ రాజ్ శాఖ, గ్రామీణ రక్షిత తాగు నీరు సరఫరా పథకం, గృహ నిర్మాణ పథకం, సర్వ శిక్షా అభియాన్ పథకం శాఖల పరిధిలో చేపట్టిన వివిధ నిర్మాణ, అభివృద్ధి పనులపై 16 వ విడత వార్షిక సామాజిక తనిఖీకి ముందుగా పంచాయితీ రాజ్ శాఖ, గ్రామీణ రక్షిత తాగు నీరు సరఫరా పథకం, గృహ నిర్మాణ పథకం, సర్వ శిక్షా అభియాన్ పథకం శాఖల అధికారులతో 23.09.2024 న శనివారం మధ్యాహ్నం 3 గంటలకు మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో సమన్వయ, సమీక్షా సమావేశాన్ని నిర్వహించగా ఆ నాలుగు శాఖల అధికారులు కూడా తమ శాఖల తరఫున చేసిన అభివృద్ధి పనుల వివరాలను నమోదు చేసిన దస్త్రాలు, ఎమ్.బుక్ లను సోషల్ ఆడిట్ బృందం అధికారులకు సకాలంలో సమర్పించకుండా కొన్ని పంచాయతీల కార్యదర్శులు సహాయం నిరాకరణ చేశారు. ఈ ఏటేటి ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదికలకు హాజరు కావడంపై ప్రజలు అనాసక్తిని చూపడం మాట అటుంచితే భాధ్యత గల ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల గైర్హాజరీని మాత్రం ప్రభుత్వం ఏవిధంగా స్వీకరిస్తుందో మరి.

## బైకుతో బస్సును ఢీకొని పురోహితుని మృతి



**అన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం అన్నవరం పోలీసు స్టేషన్ పరిధి అన్నవరంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న జాతీయ రహ దారిపై శుక్రవారం ఆర్టీసీ బస్సును ప్రమాద వశాత్తు బైకుతో ఢీకొట్టిన రోడ్డు ప్రమాదంలో స్థానిక పురోహితుడు రఘునాథశర్మ (19) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయనతోపాటు ఇదే బైకుపై ప్రయాణిస్తున్న మరొకనికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స, వైద్య సహాయం కోసం తుని ప్రభుత్వం ఆసుపత్రికి పోలీసులు తరలించారు. రాజమహేంద్రవరం నుంచి తునికి వెళుతున్న ఎపి 39 యుహెచ్ 6615 ఆర్టీసీ బస్సు అన్నవరం ఆర్టీసీ బస్టాండ్ సమీపానికి రాగానే దానికి ఎదురుగా వెళుతున్న ఏపీ40 ఎఎ 1793 జుపిటర్ ద్విచక్ర వాహనం ప్రమాద వశాత్తూ ఢీకొట్టింది. దీంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదాన్ని గుర్తించిన రాజమండ్రి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు డ్రైవర్ దుర్గాప్రసాద్ వెంటనే బస్సును నిలిపి ఉంచి బస్సులోని ప్రయాణికులను వేరే బస్సుల్లోనికి సర్దుబాటు చేసారు. మృతుడిని అన్నవరం వెలమపేటకు చెందిన పౌరుడుగా, శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయంలో పౌరోహిత్యం చేస్తున్న ఉద్యోగిగా గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసును నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎవరెస్టు బేస్ క్యాంప్‌కి గొల్లపాలెం విద్యార్థిని రూపా సాయిశ్రీ







**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాజులూరు మండలం గొల్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని పితాని రూపా సాయి శ్రీ ప్రత్యేక అవసరాల (దివ్యంగుల) విభాగం లో ఎవరెస్టు బేస్ క్యాంప్ శిక్షణ కి ఎంపికయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుశీలామణి తెలిపారు. గండికోటలో 10 రోజులు జరిగిన సెలక్షన్ లో రూపా సాయిశ్రీ ఎంపికయినట్లు ఆమె వివరించారు. ఫిబ్రవరి 23 నుండి మార్చి 6 వరకు లడ్డాక్ లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఎవరెస్టు అధిరోహణకి పంపిస్తారని తెలిపారు. ఈమేరకు పాఠశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసి రూపా సాయిశ్రీని, ఆంధ్రప్రదేశ్ టీమ్ కోచ్‌గా వెళ్తున్న శ్రీ వీజీ ప్రకాష్ రెడ్డిని అతిథుల చేతులమీదుగా సత్కరించారు. ఎమ్ఈఓ 1 డేవిడ్, హెచ్ఎమ్ సుశీలమణి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ముద్రే శివ శంకర్, సర్పంచ్ౖా ప్రసన్న మౌనిక, ఉప సర్పంచ్ శ్రీమతి తాడి భువనేశ్వరిల చేతుల మీదుగా పూలమాలలు దుస్సాలువాలతో సత్కరించారు. ఈ ఈకార్యక్రమంలో పీడీ జి.సునీల్ కుమార్, ఎ.గంగరాజు, బి.సురేష్, ధనలక్ష్మి,సాజిదా భాను,జయ శీల, రామలక్ష్మి రత్న కుమారి, అంగర కృష్ణ అభినందనలు తెలిపారు.

## కేంద్ర మంత్రి రామ్మోహన్‌పై

# తీవ్ర ఆరోపణలు.. పదవికి ముప్పేనా?



రామ్మోహన్ నాయుడు ఏ ముహూర్తాన తన శాఖ బాధ్యతలు చేపట్టారో గానీ కేంద్రంలో మరే మంత్రికి లేనన్ని చిక్కులు వెంటాడుతున్నాయని అంటున్నారు. కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు చుట్టూ వివాదాలు ముసురుకుంటున్నాయి. రామ్మోహన్ నాయుడు ఏ ముహూర్తాన తన శాఖ బాధ్యతలు చేపట్టారో గానీ కేంద్రంలో మరే మంత్రికి లేనన్ని చిక్కులు వెంటాడుతున్నాయని అంటున్నారు. విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణించడంపైనా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని టార్గెట్ చేస్తున్నారు. అజిత్ విమాన ప్రమాదంపై కుట్ర జరిగిందని, ఈ విషయమై దర్యాప్తు చేయాలని ఆయన మేనల్లుడు మహారాష్ట్ర ఎమ్మెల్యే రోహిత్ పవార్ తాజాగా డిమాండ్ చేశారు. అంతేకాకుండా దర్యాప్తు సజావుగా సాగాలంటే అది పూర్తయ్యే వరకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తన పదవి నుంచి తప్పుకోవాలని రోహిత్ పవార్ డిమాండ్ చేశారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణం ఆ రాష్ట్రంలో రాజకీయంగా పెద్ద దుమారమే రేపుతోంది. అజిత్ మరణంపై ఆయన పార్టీ నేతలు రకరకాల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విమాన ప్రమాదంపై ఇన్సూరెన్స్ కోణం ఉందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. తమ వాదనను బలపర్చేలా అనేక అంశాలను లేవనెత్తుతున్నారు. ఈ పరిణామాలతో అజిత్ మరణంపై విచారణ చేయాలని ఉప ముఖ్యమంత్రి, అజిత్ భార్య సునేత్ర పవర్ కూడా గళం విప్పారు. ప్రమాదానికి కారణమైన చార్టెర్డ్ విమానయాన సంస్థ వీఎస్ఆర్ వెంచర్స్ ను కాపాడేందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రయత్నిస్తున్నారని ఎన్సీపీ ఎమ్మెల్యే రోహిత్ పవార్ ఆరోపిస్తున్నారు. మహారాష్ట్ర రాజకీయాల్లో రోహిత్ పవార్ ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఇదే సమయంలో తెలుగు వాడైన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుని మధ్యలోకి లాగడంపైనా చర్చ జరుగుతోంది. విమాన కొనుగోలు ధర రూ.35 కోట్లు అయితే, దాని ప్రస్తుత మార్కెట్ ధర రూ.10 కోట్లు ఉంటుందని ఎన్సీపీ నేతలు చెబుతున్నారు. అయితే విమానానికి రూ.55 కోట్ల ఇన్సూరెన్స్, రూ.210 కోట్ల లయబిలిటీ ఇన్సూరెన్స్ చేయడంపై ఎన్సీపీ నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ప్రమాదానికి గురైన విమానయాన సంస్థను కాపాడేందుకు తెలుగుదేశం పార్టీ నేతలు ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. టీడీపీ నేతలతోపాటు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి వీఎస్ఆర్ వెంచర్స్ యాజమాన్యం అత్యంత సన్నిహితంగా ఉందని, వీఎస్ఆర్ సంస్థ యజమాని వీకే సింగ్ కుమారుడు వివాహానికి ఏపీకి చెందిన పలువురు నేతలు హాజరయ్యారంటూ ఎన్సీపీ ఎమ్మెల్యే రోహిత్ పవార్ చేసిన ఆరోపణలు దుమారం రేపుతున్నాయి. అంతేకాకుండా ప్రమాదం జరిగిన వెంటనే వీకే సింగ్, ఆయన కుమారుడు రోహిత్ సింగ్ దేశం విడిచి వెళ్లిపోయారని ఆయన ఆరోపించారు. కాగా, ఈ వ్యవహారంపై ఎన్సీపీ (ఎస్) ఎంపీ, అజిత్ సోదరి సుప్రియ సూలే కూడా స్పందించారు. ప్రమాదంపై రోజుకొక కొత్త విషయం బయటపడుతోందని, ఈ ఘటనపై పారదర్శక, సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.


# మంత్రివర్గ ఉపసంఘం భేటీ..

### పరిపాలనా భవనాల నిర్మాణంపై చర్చ



అమరావతి, **విశ్వం వాయిస్ న్యూస్ :** ఐకానిక్ టవర్స్‌లోనే డీజీపీ ఆఫీసు ఉండాలా, విడిగా ఉండాలా అనేదానిపై సీఎందే నిర్ణయమని మంత్రి నారాయణ అన్నారు. ఆయన అధ్యక్షతన శుక్రవారం మంత్రివర్గ ఉపసంఘం భేటీ అయ్యింది. పరిపాలనా భవనాల నిర్మాణం, శాఖల వారీగా ఉద్యోగుల మేరకు వర్క్‌స్పేస్ కేటాయింపులు తదితర అంశాలపై చర్చించారు. తొలుత 31.71 లక్షల చదరపు అడుగుల వర్క్‌స్పేస్ అంచనా వేశామని, దీనిపై మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి నారాయణ మీడియాకు తెలిపారు. శాఖల వారీగా ఉద్యోగుల వివరాలపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరినట్లు చెప్పారు.

# టీవీ సౌండ్ తగ్గించమన్న భర్తను చంపిన 'మంగళగిరి' భార్య



దారుణ నేరాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. గతంలో హత్య లాంటి తీవ్రమైన నేరాల వెనుక చాలానే విషయాలు ఉండేవి. ఇప్పుడు అకస్మాత్తుగా వచ్చే కోపం ప్రాణాల్నితీసే వరకు వెళుతోంది. అది కూడా జీవితభాగస్వామిపైనా. తాజాగా ఒక షాకింగ్ ఉదంతం గుంటూరు జిల్లాలోని మంగళగిరిలోచోటు చేసుకుంది. టీవీ సౌండ్ తగ్గించమన్న భర్తపై తీవ్ర ఆగ్రహంతో చంపేసిన భార్య ఉదంతం షాకింగ్ గా మారింది. ఏడాదిన్నర క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు అహ్మద్.. క్రాంతి. వీరిద్దరూ గుంటూరు జిల్లా మంగళగిరి టిడ్కో ఇళ్ల సముదాయంలో (బి బ్లాక్) నివాసం ఉంటున్నారు. అహమ్మద్ ఏసీ మెకానిక్ గా పని చేస్తుంటే.. క్రాంతి ఒక ప్రైవేటు కంపెనీలో పని చేస్తోంది. అయితే.. వీరిది ప్రేమ వివాహం అయినప్పటికి.. పలుమార్లు గొడవపడటం పోలీస్ స్టేషన్లకు వెళ్లినట్లుగా చెబుతున్నారు. దీంతో.. వీరిద్దరికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపేవారు. ఇద్దరిది వేర్వేరు మతాచారాలు క్షవటంతో ఇద్దరూ ఉపవాసాలు ఉంటూ రోజూ భక్తి గీతాలు వినేవారు. క్రాంతి భక్తి పాటలు వింటుండగా.. అహ్మద్ సౌండ్ తగ్గించాలని కోరాడు. అయినప్పటికీ క్రాంతి నుంచి ఎలాంటి మార్పు లేకపోవటంతో.. వారిద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. గొడవ తీవ్ర రూపం దాల్చటంతో తీవ్ర ఆగ్రహానికి గురైన క్రాంతి వంటింట్లోని కూరగాయలు కోసే కత్తితో క్షణికావేశంలో భర్తను పొడిచింది. దీంతో అహమ్మద్ సొమ్మసిల్లి పడిపోయాడు.

క్రాంతి వెంటనే అతడి తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. అదే సమయంలో స్థానికుల నుంచి వచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. గాయపడిన అహమ్మద్ ను తొలుత ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.చికిత్స అందిస్తుండగా అహమ్మద్ మరణించాడు. క్రాంతిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు. క్షణికావేశంతో భర్తను కత్తితో పొడిచిందా? ఇంకేమైనా కారణం ఉందా? అన్న కోణంలో మంగళగిరి పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ ఉదంతం స్థానికంగా సంచలనంగా మారింది.

## అనంతబాబుకు కౌంట్ డౌన్..

# సుప్రీం డెడ్ లైన్, పోలీసులకు చీవాట్లు!!



డ్రైవర్ హత్య కేసులో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో నిందితుడుకు సహకరిస్తున్నారని ఏపీ పోలీసులపై సుప్రీంకోర్టు మండిపడింది. హత్య కేసు దర్యాప్తును ఏపీ పోలీసులు సాగదీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు పోలీసులకు చేతకాకపోతే కేసును సీబీఐకి అప్పగిస్తామంటూ హెచ్చరించింది. సుప్రీం వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. ఇప్పటికే డ్రైవర్ హత్య కేసులో అనంతబాబుతోపాటు ఆయన భార్యను నిందితురాలిగా చేర్చుతూ పోలీసులు సప్లిమెంట్ చార్జిషీటు దాఖలు చేశారు. అనంతబాబు భార్య లక్ష్మీదుర్గను అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పోలీసుల తీరుపై సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేస్తూ సీరియస్ కామెంట్లు చేయడం హీట్ పుట్టిస్తోంది. ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం 2022లో హత్యకు గురయ్యాడు. ఈ కేసులో ఏ1గా అనంతబాబుపై అభియోగాలు నమోదు అయ్యాయి. అయితే అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు సకాలంలో చార్జిషీటు దాఖలు చేయకపోవడంతో నిందితుడికి డీఫాల్ట్ బెయిలు లభించింది. ఇప్పటివరకు నిందితుడు డీఫాల్ట్ బెయిల్ పైనే ఉన్నాడు. దీంతో వ్యవహారం సుప్రీంకోర్టు దృష్టికి వెళ్లింది. కేసు విచారించిన సుప్రీంకోర్టు 2022లో హత్య జరిగితే ఇప్పటివరకు అభియోగాలు నమోదు చేయకపోవడంపై విస్మయం వ్యక్తం చేసింది. దర్యాప్తులో పోలీసులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తూ సాగదీస్తున్నారని మండిపడింది. అంతేకాకుండా ఏప్రిల్ 18వ తేదీలోగా అభియోగాలు నమోదు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. ఆ తరువాత నవంబరు 30లోగా కేసు ట్రయల్ ముగించాలని హైకోర్టును ఆదేశించింది. అప్పటివరకు నిందితుడు అనంతబాబుకు డీఫాల్ట్ బెయిలు పొడిగిస్తున్నట్లు వెల్లడించింది. డ్రైవర్ హత్య కేసుపై సుప్రీంకోర్టులో శుక్రవారం చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం విచారణ చేపట్టింది. కేసు దర్యాప్తులో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం, అప్పట్లో అధికారంలో ఉండటంతో నిందితుడితో పోలీసులు కుమ్మక్కు అయ్యారని వ్యాఖ్యానించింది. నిందితుడికి డీఫాల్ట్ బెయిల్ వచ్చేలా చార్జిషీటు దాఖలు చేశారని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. తప్పు చేసిన పోలీసులపై ప్రస్తుత ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించింది. డీజీపీ, ఎస్పీలు ఏం చేస్తున్నారని నిలదీసింది. పోలీసులు, నిందితుడు సహకరించుకున్నట్లు కనిపిస్తోందన్న సుప్రీం వ్యాఖ్యలు హాట్ టాపిక్ అయ్యాయి. పోలీసుల తీరును తప్పుపట్టిన న్యాయస్థానం, కేసు ట్రయల్ పై నిర్దిష్ట ఆదేశాలు ఇవ్వడం చర్చనీయాంశం అవుతోంది. సుప్రీం తీర్పుతో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు మరిన్ని కష్టాలు చుట్టిముట్టినట్లుగా వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం కేసు పునర్విచారణకు ఆదేశించడంతో అనంతబాబు భార్య నిందితురాలిగా మారారని అంటున్నారు. ఇప్పుడు సుప్రీం తాజా వ్యాఖ్యలతో మరో 9 నెలల్లో కేసు విచారణ ముగిసే అవకాశం ఉందని అంటున్నారు.

# రూ.2 కోట్లతో 3వ డివిజన్‌లో అభివృద్ధి పనులు

## రూ. 10 లక్షలతో డ్రైనేజీల అభివృద్ధికి శంకుస్థాపనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడి

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక 3వ డివిజన్‌లో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. సదరు డివిజన్ లోని డ్రైనేజీల అభివృద్ధి కోసం రూ. 10 లక్షలతో చేపట్టిన పనులకు ఈ రోజు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి అధికా రంలోకి వచ్చిన తరువాత అభివృద్దే ధ్యేయంగా పనులు చేయడం జరుగు తోందన్నారు. నగరంలోని అన్ని డివి జన్లలో ఏదో ఒక ప్రాంతంలో నిత్యం అభివృద్ధి పనులు జరుగుతుండడాన్ని మనం చూడొచ్చన్నారు. కాగా 3వ డివి జన్‌లో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సుమారు రూ. 20 లక్షలతో గతంలో అభివృద్ధి పనులు చేయడం జరిగిందని వివరించారు.



ప్రస్తుతం రూ. 10 లక్షలతో డ్రైన్స్ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మొత్తంగా రూ. 30 లక్షలతో పనుల పూర్తి చేయ డం... చేపట్టడం జరిగిందన్నారు. ఏవీ అప్పారావు రోడ్డునుంచి ఆర్ట్స్ కళాశాల వరకూ ఉన్న రోడ్డును రూ.కోటి 80 లక్షలతో నిర్మించేందుకు ప్రణాళికలు ఉన్నాయి. దానికి సంబంధించిన పనులు టెండర్ స్టేజ్‌లో ఉన్నాయన్నారు. సదరు 3వ డివిజన్‌లో రోడ్లు డ్రైనేజీల నిర్మాణా నికి మరో రూ. 2 కోట్లు అవసరం ఉందన్నారు. ఆ పనులన్నీ పూర్తయితే ఈ డివిజన్‌ను సంపూర్ణంగా అభివృద్ధి చేసినట్టు అవుతుందన్నారు. ఇవన్నీ పుష్కరాలలోపు పూర్తి చేయాలన్న సం కల్పంతో ఉన్నామన్నారు. కాగా గత వైకాపా పాలకులు ఉన్న నిధులను ఎలా దుర్వినియోగం చేశారో... సుం కరీకరణ పేరుతో ఎలా ప్రచార ఆర్భా టం చేశారో ప్రజలు గమనించాలన్నారు. ఆ నిధులన్నీ అనవరమైన పనులకు వెచ్చించారని మండిపడ్డారు. ప్రస్తుతం తామయితే ప్రజలకు ఏం అవసరమో... ప్రజల ఆలోచనలకు తగ్గట్టే ఆ పనులు చేయడం జరుగుతోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవనీ కుమార్, ఛాంబర్ మాజీ అధ్యక్షులు దొండపాటి సత్యం బాబు, స్థానిక నాయకులు జక్కంపూడి అర్జున్, అహ్మదున్నీషా, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

# జ్వాలాపురం శ్రీకాంత్ వ్యాఖ్యలపై తేజోమూర్తుల ఆగ్రహం

## ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే గుణపాఠం తప్పదని హెచ్చరిక - కూటమి బ్రాహ్మణుల సంక్షేమానికి కట్టుబడి ఉందని వెల్లడి

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామ్‌ప్రసాద్‌పై దేవాదాయ శాఖ మాజీ సలహాదారు, వైసీపీ నాయ కుడు జ్వాలాపురం శ్రీకాంత్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన సీనియర్ నాయకుడు తేజోమూర్తుల లక్ష్మీ నరసింహమూర్తి అభ్యంతరం వ్యక్తం చేసారు. కూటమి ప్రభుత్వం బ్రాహ్మణ సామాజిక వర్గ సంక్షేమానికి కట్టుబడి ఉందన్న విషయం ఈ 18 నెలల పాలనలోనే ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌లు నిరూపించడం జరిగిం దన్నారు. స్థానిక గోరక్షణ పేటలో ఉన్న శ్రీకరం మినీ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో తేజోమూర్తుల మాట్లా డుతూ నోటికొచ్చినట్టుగా పదజాలం వాడటం, దూషించడం మాకు వచ్చని, అయితే తమ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తమకు నేర్పిన సంస్కారంతోనే జాగ్రత్తగా మాట్లాడుతున్నామన్న విష యాన్ని గుర్తించాలన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్, క్రెడిట్ సొసైటీలు ఏం చేస్తున్నాయని ప్రశ్నిస్తున్న జ్వాలాపురం శ్రీకాంత్ గతంలో జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా క్రెడిట్ సొసైటీ కార్యాలయానికి తాళం వేసినప్పుడు ఏమైపోయారని ప్రశ్నించారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో బ్రాహ్మణుల సంక్షేమానికి 780 కోట్ల 90 లక్షలు ఖర్చు చేస్తే కూటమి ప్రభుత్వం ఈ 18 నెలల కాలంలో 2 లక్షల 21 వేల మంది లబ్దిదారులకు 571 కోట్ల 77 లక్షల రూపాయల మేరకు లబ్ధి చేకూర్చిందన్నారు. ఈ వివరాలన్నీ ఆన్‌లైన్‌లోనే ఉన్నాయని వాటిని చూసుకుని మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. జగన్ పంపిన స్క్రిప్ట్ చదువుతూ జరిగిన సంక్షేమాన్ని మర్చిపోయి మాట్లాడటం ఆయనకు తగదని పేర్కొన్నారు. ఈ సంవత్సరానికిగానూ బడ్జెట్లో బ్రాహ్మణ సంక్షేమానికి ప్రభుత్వం 353 కోట్లు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇంకా మూడు సంవత్సరాల కాలం ఉందని ఈ సమయంలో ఎన్నో కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ ద్వారా ఇప్పటివరకు సుమారు 337 కోట్ల రూపాయల మేరకు లావాదేవీలు జరుగుతున్నాయని, 58 కోట్ల డిపాజిట్లు



ఉన్నాయన్నారు. ఆయన అడిగిన ప్రతీ ప్రశ్నకు తమ వద్ద ఖచ్చితమైన సమాధానం ఉందని, ఆ విషయం తెలుసుకుంటే వైసిపి కంటే కూటమి ప్రభుత్వ హయాంలో బ్రాహ్మణులకు ఎంత సంక్షేమం జరిగిందో తెలుస్తుందన్నారు. దీనితో పాటు ప్రతీ దేవాదాయ కమిటీలోనూ ఒక ఎక్స్ అఫీషియో డైరెక్టర్లుగా బ్రాహ్మణులకు అవకాశం కల్పించారని, ఆ విధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని దేవాలయాల్లోనూ నియామకాలు జరిగాయన్నారు. అర్చకులకు నెలకు 15 వేల జీతం ఇస్తున్నారని తెలిపారు. మాజీ మంత్రి రోజా జనసేన కార్యకర్తలు జెండా కూలీలని చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. అసలైన కూలీ రోజాయేనని, ఆమెది ఐరన్ లెగ్ అని ఆమె ఎక్కడ కాలు పెట్టినా, దేని గురించి మాట్లాడినా అది భస్మం కావడం ఖాయమని ఎద్దేవా చేసారు. ఆమె పిచ్చిపిచ్చిగా మాట్లాడటం మానుకోవాలని సూచించారు. సమావేశంలో టీడీపీ బ్రాహ్మణ సాధికారిక సమితి నాయకులు ముత్య సత్యనారాయణ, టీడీపీ జిల్లా సాధికార సమితి నాయకుడు భమిడిపల్లి వెంకటరమణమూర్తి, దేవాలయాల డైరెక్టర్లు కాళీపట్నం మణికంఠ శర్మ, బోడెం రవికుమార్ శర్మ, కూటమి నాయకులు అక్కిరెడ్డి ప్రసాద్, నిముషకవి వెంకటేష్, గన్నాబత్తుల ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# శాసనమండలిలో మళ్లీ రచ్చ..

## శ్రీవారి ఫొటోలు ప్రదర్శనపై సర్కార్ ఆగ్రహం



ఏపీ శాసనమండలి సమావేశాలు వాడివేడిగా కొనసాగుతున్నాయి. విపక్షం వైసీపీ దూకుడు చూపడం, అధికార పార్టీ అందుకు తగ్గట్టే ఎదురుదాడి చేస్తుండటంతో సభలో రచ్చ కంటిన్యూ అవుతోంది. టీటీడీకి నెయ్యి సరఫరా చేసిన ఇందాపూర్ డెయిరీకి హెరిటేజ్ డెయిరీతో ఉన్న సంబంధంపై చర్చించాలని వైసీపీ పట్టుబట్టడం తీవ్ర దుమారానికి కారణమవుతోంది. ఇప్పటికే ఈ అంశంపై చర్చించేందుకు రెండు రోజులు పాటు వరుసగా వాయిదా తీర్మానాలు ఇచ్చింది వైసీపీ. వైసీపీ వాయిదా నోటీసులను చైర్మన్ తిరస్కరించగా, శుక్రవారం సభలో శ్రీవెంకటేశ్వరస్వామి ఫొటోలను ప్రదర్శించడం వివాదాస్పదమైంది. అంతేకాకుండా స్వామి వారి ఫొటోలను విసిరేసిన వైసీపీ ఎమ్మెల్సీలు మహాపరాధం చేశారని టీడీపీ సభ్యులు ఆరోపించారు. మండలిలో దేవదేవుడి చిత్రపటాలను ప్రదర్శించి వైసీపీ సభ్యులు మహాపరాధం చేశారని అధికార పార్టీ సభ్యులు మండిపడ్డారు. రాజకీయాల కోసం వెంకటేశ్వరుడి బొమ్మలు వాడటాన్ని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తప్పుబట్టారు. ఈ విషయమై సభలో గట్టిగా మాట్లాడిన ఆర్థిక మంత్రి కేశవ్ వైసీపీ సభ్యుల చర్యను ఖండించాలని కోరారు. అదేసమయంలో కాళ్లకు చెప్పులు వేసుకుని దేవుడి ఫొటోలను ప్రదర్శించడాన్ని తప్పుపట్టారు. ఇది శ్రీవారికి చేసిన మహాపరాధంగా అధికార పార్టీ సభ్యులు ఆరోపించారు. హెరిటేజ్ అంశంపై చర్చించాలని పట్టుబడుతున్న వైసీపీ సభ్యులు వెంకటేశ్వరస్వామి ఫొటోలు, ప్లకార్డులు పట్టుకుని చైర్మన్ పోడియం చుట్టుముట్టారు. నినాదాలు చేస్తూ సభ స్తంభించాలని ప్రయత్నించారు. ఇటు వైసీపీ సభ్యులు, అటు అధికార కూటమి సభ్యులు పోటాపోటీ నినాదాలతో సభలో గందరగోళం చోటుచేసుకుంది. దీంతో చైర్మన్ మండలిని పది నిమిషాల పాటు వాయిదా వేశారు. అయితే సభలో వెంకటేశ్వరసామి చిత్రపటాలను ప్రదర్శించడంతోపాటు కాళ్లకు చెప్పులు వేసుకుని శ్రీవారి ఫొటోలను పట్టుకోవడాన్ని అధికార పార్టీ ఎత్తిచూపింది. పరమ పవిత్రంగా పూజించే శ్రీవారు అంటే వైసీపీకి భక్తి లేదని, మహాపరాధం చేశారని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. ఈ విమర్శలను మీడియా పాయింట్ వద్ద విపక్ష సభ్యులు తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. తాము చెప్పులు వేసుకుని శ్రీవారి ఫొటోలు పట్టుకోలేదని వివరణ ఇచ్చారు. అయితే మండలిలో వైసీపీ సభ్యులు చెప్పులు వేసుకుని దేవుడి ఫొటోలు ప్రదర్శిస్తున్న ఫొటోలు, వీడియోలను ప్రభుత్వం బయటపెట్టింది. వైసీపీ సభ్యుల చర్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీసేవిగా ఉన్నాయని ప్రభుత్వం ధ్వజమెత్తింది. వైసీపీ సభ్యుల తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందని ఆర్థిక మంత్రి కేశవ్ మండిపడ్డారు. సభలో ప్రతిరోజూ రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తున్నారంటూ వైసీపీ సభ్యుల తీరును ఆయన ఎండగట్టారు. వైసీపీ సభ్యులు హద్దులు దాటి ప్రవర్తించారని పేర్కొన్నారు. దేవుడిని రాజకీయాల్లోకి లాగడం ఏమిటని వైసీపీ సభ్యులను మంత్రి పయ్యావుల సూటిగా ప్రశ్నించారు. బీజేపీ కూడా ఈ అంశంపై స్పందించింది. చెప్పులేసుకుని దేవుడి ఫొటోలతో సభలోకి రావడం క్షమించరాని నేరమని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో దేవుడి ఫొటోలను విసిరేశారంటూ ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. దేవుడు అంటే మాజీ సీఎం జగన్మోహనరెడ్డి భక్తి, భయం లేవని సోము వీర్రాజు ధ్వజమెత్తారు.

# వాటర్ కూలింగ్ డిస్పెన్సర్ బహుకరణ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(దిపిఎంపి అసోసియేషన్) తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి పి.దేవానందం సహకారంతో శుక్రవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆఫీసు కు 'వాటర్ కూలింగ్ డిస్పెన్సర్' ను రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పీఎంపీల సేవలు అభినందనీయమని, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలలో పీఎంపీలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు, రాజమండ్రి శాఖ కార్యదర్శి మట్టా రమేష్, డీఎమ్‌డహెచ్ఓ సిబ్బంది పాల్గొన్నారు.

# జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ దొరబాబు గుండెపోటుతో మృతి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ దొరబాబు గోకవరం మండలం రంపయర్రంపాలెం గ్రామంలో స్వగృహంలో మరణించారని కాలేజీ అధ్యాపకులు తెలియజేశారు. దాంతో స్వంత గ్రామంలోనూ, సీతానగరం మండల ప్రభుత్వ కాలేజీ నందు విషాద ఛాయలు అలుముకున్నాయి. సౌమ్యుడు, విద్యా వంతుడు, అందరికీ మంచిని బోధించే గురువు లేరని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, సీతానగరం మండలం ప్రెస్ క్లబ్ సభ్యులు ప్రిన్సిపాల్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి

**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా, సీతానగరం మండలం సీతానగరం,సింగవరం కాలనీ,రఘుదేవపురం గ్రామ పరిధిలోని గృహ, వాణిజ్య వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో శుక్రవారం మొదలు సోమవారం వరకు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పలు అభివృద్ధి మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగును. కావున విద్యుత్ వినియోగదారులు అందరూ గమనించి డిపార్ట్మెంట్ వారికి సహకరించవలసిందిగా జె.పి.బి. నటరాజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆపరేషన్, ఏపీఈపిడిసిఎల్ రాజమహేం ద్రవరం రూరల్ వారు తెలియజేశారు. విద్యుత్ వినియోగదారులు అందరూ ఈ అసౌకర్యానికి గమనించి డిపార్ట్ మెంట్ వారికి సహకరించవలసినదిగా కోరుతున్నాము.

# 21న విద్యుత్‌కు అంతరాయం : నటరాజన్



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం గాడాల సబ్ స్టేషన్ పరిధిలోని 33/11 కెవి మరమ్మతుల నిమిత్తం శనివారం ఈ క్రింది గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనట్లు రాజమహేంద్రవరం రూరల్ ఎలక్ట్రికల్ ఇంజనీరు నటరాజన్ తెలిపారు. శనివారం ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు కోరుకొండ మండలంలోని గాడాల, నిడిగట్ల,మధురపూడి గ్రామములకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించవలసినదిగా తెలియజేశారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఇటీవల హాస్పటల్స్‌లో వైద్యం చేయించుకుని ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి ధరఖాస్తు చేసుకున్న 61 మందికి రూ.37,19,880/-లు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరు కాగా చెక్కులను శుక్రవారం మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, శాసన సభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితర్లు పాల్గొన్నారు.

### పొన్నాడ వారి వివాహ వేడుకలో పాల్గొన్న

# రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండల కేంద్రంలో జీవీకే కళ్యాణ మండపంలో జరిగిన పొన్నాడ వారి వివాహ వేడుకలో వారి ఆహ్వానం మేరకు రుడా ఛైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇన్చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఐవిఆర్ఎస్ టెలికాల్ సర్వేలో

# మండపేట రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం



**కమిషనర్ కృషికి దక్కిన ఫలితం**

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఇంటింటా చెత్త సేకరణపై ఐ.వి.ఆర్.ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా నిర్వహించిన సర్వేలో మండపేట రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. ప్రతిరోజూ శానిటరీ సిబ్బంది మీ ఇంటికి వస్తున్నారా? చెత్తను పూర్తిగా శుభ్రం చేస్తున్నారా? డ్రైనేజీలను శుభ్రం చేస్తున్నారా తదితర అంశాలపై ప్రభుత్వం ఫోన్ కాల్స్ ద్వారా సర్వే చేపట్టింది. ఈ సర్వేలో 82.5 శాతం ప్రజలు శానిటేషన్ పని తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. సానుకూలంగా స్పందించారు. దీంతో మండపేట మున్సిపాలిటీ రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం లో నిలిచింది. మొత్తానికి మండపేట మున్సిపల్ కమీషనర్ టీవీ రంగారావు కృషి ఫలించింది. ఆయన అనునిత్యం ఎంతో బాధ్యతాయుతంగా విధి నిర్వహణ సాగిస్తుంటారు. రాజీ లేని ధోరణి తో అనుకున్నది సాధిస్తారు. దాంతోనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయి. ఈ సందర్భంగా మున్సిపల్ పారిశుధ్య సిబ్బందిని, మెప్మా ఆర్పీలను కమీషనర్ ప్రత్యేకంగా అభినందించారు.



## రాయల్ లుక్‌లో యంగ్ బ్యూటీ
# సారా అర్జున్..

నటి సారా అర్జున్ 'ధురంధర్' బ్లాక్ బాస్టర్ హిట్ తర్వాత ఒక్కసారిగా వార్తల్లో నిలిచింది. గత డిసెంబరులో రిలీజైనప్పటి నుంచి ఓటీటీలోకి వచ్చిన తర్వాత కూడా మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. ఈ చిత్రంలో ఆమె నటనకు మంచి ప్రశంసలు లభించాయి. తాజాగా సారా.. నటి సారా అర్జున్ 'ధురంధర్' బ్లాక్ బాస్టర్ హిట్ తర్వాత ఒక్కసారిగా వార్తల్లో నిలిచింది. గత డిసెంబరులో రిలీజైనప్పటి నుంచి ఓటీటీలోకి వచ్చిన తర్వాత కూడా మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. ఈ చిత్రంలో ఆమె నటనకు మంచి ప్రశంసలు లభించాయి. సారా అర్జున్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. తాజాగా ఆమె తన స్టైలిష్ ఫోటోలను షేర్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. సారా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో బ్లాక్ చీరలో ఉన్న ఫోటోలను షేర్ చేసింది. ప్రస్తుతం అవి సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలలో సారా అందంగా స్పెషల్ లుక్‌లో కనిపిస్తుంది. ఇందులో సారా బంగారు రంగు వెల్వెట్ చీరను ధరించింది. దీంతో రాయల్, క్లాసీగా కనిపిస్తుంది. చీర కట్టులో సారా వివిధ భంగింమల్లో కిల్లర్ పోజులు ఇచ్చింది. ఈ ఫోటోలు షేర్ చేసిన వెంటనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇక సినిమాల విషయానికొస్తే సారా నటించిన తొలి తెలుగు మూవీ 'యుఫోరియా' శుక్రవారం థియేటర్లలో విడుదలైన సంగతి తెలిసిందే. హీరోయిన్ భూమిక, గౌతమ్ మీనన్, నాజర్ లాంటి నటులతో ప్రయోగాత్మకంగా దర్శకుడు గుణశేఖర్ యుఫోరియాను ప్రేక్షకులముందుకు తెచ్చాడు. ప్రస్తుతం ఈ మువీ మంచి టాక్‌తో ఈ మువీ దూసుకుపోతుంది.

సినీ వాయిస్ CINEMA

## స్టార్ హీరోయిన్ పక్కన క్యారెక్టర్ కోసం వెళ్తే
# అవమానించారు..
## ఆరోజు ఫుల్ ఏడ్చేశా.. హీరో సుహాస్ ఎమోషనల్..



సాధారణ కుర్రాడు ఇప్పుడు విభిన్నమైన కంటెంట్ చిత్రాలు.. వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ఓ గుర్తింపు సంపాదించుకున్నారు. అతడు మరెవరో కాదు.. హీరో సుహాస్. ప్రస్తుతం హే బల్వంత్ మూవీతో అడియన్స్ ముందుకు వచ్చారు. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తనకు ఎదురైన చేదు అనుభవాలను గుర్తుచేసుకున్నారు. టాలీవుడ్ హీరో సుహాస్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. మొదట్లో సినిమాల్లో చిన్న చిన్న పాత్రలో పోషించిన సుహాస్.. కలర్ ఫోటో సినిమాతో హీరోగా మారాడు. మొదటి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకున్న సుహాస్.. ఆ తర్వాత వరుస చిత్రాలతో మెప్పిస్తున్నాడు. ప్రస్తుతం హే బల్వంత్ అనే సినిమాతో అడియన్స్ ముందుకు వచ్చారు. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సుహాస్ తన కెరీర్‌లోని వివిధ దశలను, అలాగే ఎదురైన అవమానాలను వివరించారు. ఒక నటుడిగా పదేళ్లుగా సాగుతున్న తన ప్రయాణంలో ఎదురైన అనుభవాలు, విజయాలు, చేదు సంఘటనలను చెప్పుకొచ్చారు. ఎక్కువ నమ్మకం పెట్టుకున్న సినిమాలపై ఈ టెన్షన్ మరింత ఎక్కువగా ఉంటుందని, కొన్నిసార్లు నిద్ర కూడా పట్టదని, వేకువజామున 3 లేదా 4 గంటలకు మెలకువ వస్తుందని అన్నారు. ఈ ఒత్తిడిని తగ్గించుకోవడానికి పిల్లలతో ఆడుకోవడం లేదా కారులో తిరగడం వంటివి చేస్తుంటానని చెప్పారు. సినిమా ఫలితాన్ని ముందుగా తన స్నేహితులు, కుటుంబ సభ్యులు చూసి చెబుతారని, వారి నిజాయితీతో కూడిన అభిప్రాయం తనకెంతో ముఖ్యమని సుహాస్ పేర్కొన్నారు. తాను సాధారణంగా ఇంట్రావర్ట్‌నని ప్రచారంలో ఉన్నప్పటికీ, కెమెరా ముందు మాత్రమే అలా ఉంటానని, బయట మాత్రం చాలా ఎక్స్‌ట్రావర్ట్‌నని సుహాస్ స్పష్టం చేశారు. లైట్ల ముందు తెలియకుండానే అలెర్ట్ అవుతానని వివరించారు. తాను తన స్నేహితుల సర్కిల్‌కు అలవాటు పడిపోయానని, పార్టీల వంటి వాటికి దూరంగా ఉంటానని తెలిపారు. సినిమా అవకాశాల కోసం పడిన కష్టాలు, కడుపు నిండక కన్నీళు పెట్టుకున్న క్షణాలు, యూట్యూబ్ నుండి హీరోగా మారి, ఓటీటీలో బ్లాక్‌బస్టర్‌గా నిలిచి జాతీయ అవార్డు గెలుచుకోవడం వంటి అంశాలను పేర్కొన్నారు. విజయవాడ నుండి సినీ రంగంలో అడుగుపెట్టి, తన మొదటి సినిమా ప్రీమియర్ తిరిగి విజయవాడలోనే పడటం అద్భుతమని ఆ పోస్ట్‌లో రాశారు. ఈ పదేళ్ల ప్రయాణం తనకు చాలా ఆనందాన్ని ఇచ్చిందని సుహాస్ అన్నారు. అయితే, ఈ ప్రయాణంలో ఎదురైన ఒక చేదు అనుభవాన్ని కూడా సుహాస్ పంచుకున్నారు. మజిలీ హిట్ అయిన తర్వాత, కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తున్న ఉప్పు కర్పూరం అనే సినిమాలో ఆమె స్నేహితుడి పాత్రకు తనకు అవకాశం వచ్చిందని తెలిపారు. సెట్‌లో ఒక వ్యక్తి "కీర్తి సురేష్‌తో నువ్వు ఇంత క్లోజ్‌గా ఉంటావా?" అని వ్యంగ్యంగా అడిగారని, ఆ మాట తనను తీవ్రంగా బాధించిందని సుహాస్ చెప్పారు. ఆ రోజు షూటింగ్ వదిలేసి, తన స్నేహితుడు సందీప్ దగ్గరికి వెళ్లి ఏడ్చేశానని, సినిమాలను వదిలేసి విజయవాడకు తిరిగి వెళ్లిపోవాలని అనుకున్నానని ఎమోషనల్ అయ్యారు. ఆ సంఘటన తనలో కసిని పెంచిందని తెలిపారు. ఈ విషయం కీర్తి సురేష్‌కు ఇప్పటివరకు తెలియదని, ఆమె చాలా మంచి, దయగల వ్యక్తి అని, ఆమె నటనకు ఎంత పెద్ద అభిమానినో, ఆమె నిజమైన వ్యక్తిత్వానికి కూడా అంతే అభిమానినని సుహాస్ అన్నారు. ఇలాంటి అనుభవాలే నటుడిగా తనను ముందుకు నడిపాయని, ఎలాంటి నేపథ్యం లేని వారు కూడా హీరోలు కావచ్చని తన ప్రయాణం ద్వారా చెప్పదలచుకున్నానని సుహాస్ అన్నారు.

క్రీడా వాయిస్

## ఏంటీ అన్యాయం? టాపర్లందరూ ఒకే గ్రూపులో..
# సూపర్-8 ఫార్మాట్‌పై ఫ్యాన్స్ ఆగ్రహం




టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్-8 ఫార్మాట్‌పై ప్రస్తుతం క్రికెట్ ప్రపంచంలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ఐసీసీ ప్రవేశపెట్టిన ప్రీ-సీడింగ్ విధానం వల్ల టోర్నీలో అసమతుల్యత ఏర్పడిందని క్రీడా అభిమానులు, విశ్లేషకులు మండిపడుతున్నారు. అసలు ఈ వివాదం ఏంటి? ఐసీసీ ఎందుకు విమర్శలు ఎదుర్కొంటోంది? వంటి వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం. సాధారణంగా ఏదైనా టోర్నమెంట్‌లో గ్రూప్ స్టేజ్ ముగిసిన తర్వాత, పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన జట్లకు తదుపరి రౌండ్లో కాస్త సులభమైన డ్రా వస్తుంది. కానీ ఈసారి ఐసీసీ టోర్నీ మొదలవ్వకముందే ఏ టీమ్ ఏ గ్రూపులో ఉండాలో ఫిక్స్ చేసేసింది. దీనినే ప్రీ-సీడింగ్ అంటారు. అంటే.. ఒక టీమ్ తన గ్రూపులో ఫస్ట్ వచ్చినా, సెకండ్ వచ్చినా.. ముందుగా అనుకున్న స్లాట్‌లోనే ఉంటుంది.ఈ ముందస్తు నిర్ణయం వల్ల ఒక వింత పరిస్థితి ఏర్పడింది. గ్రూప్ స్టేజ్‌లో టాపర్లుగా నిలిచిన భారత్, జింబాబ్వే, వెస్టిండీస్, సౌతాఫ్రికా.. ఈ నలుగురు సూపర్-8లో ఒకే గ్రూపులో (గ్రూప్-1) చేరారు. మరోవైపు, రెండో స్థానంలో నిలిచిన పాకిస్థాన్, శ్రీలంక, ఇంగ్లాండ్, న్యూజిలాండ్ జట్లన్నీ రెండో గ్రూపులో (గ్రూప్-2) ఉన్నాయి. దీనివల్ల మొదటి రౌండ్లో అద్భుతంగా ఆడి అగ్రస్థానంలో నిలిచిన జట్లలో ఇద్దరు సెమీస్ చేరకుండానే ఇంటికి వెళ్లాల్సి వస్తుంది. అదే సమయంలో రెండో స్థానంలో నిలిచిన జట్లకు సెమీస్ చేరడం పేపర్ మీద సులభంగా మారుతోంది. ఇది ప్రతిభను గౌరవించేలా లేదని విమర్శకులు అంటున్నారు. గ్రూప్ స్టేజ్ చివరి మ్యాచ్‌లు చాలా ఉత్కంఠగా సాగాలి. కానీ ఈ ఫార్మాట్ వల్ల ఎవరు టాపర్‌గా నిలిచినా సూపర్-8 పొజిషన్ మారదు కాబట్టి, ఆ మ్యాచ్‌లకు విలువ లేకుండా పోతోందని ఫ్యాన్స్ ఫీలవుతున్నారు. ఉదాహరణకు.. సౌతాఫ్రికా తన గ్రూపులో టాపర్‌గా నిలిచినా, న్యూజిలాండ్ (సెకండ్ వచ్చిన జట్టు) కంటే తక్కువ సీడింగ్‌లోనే కొనసాగాల్సి రావడం అన్యాయమని నిపుణులు వేలెత్తి చూపుతున్నారు. ఈ విమర్శలపై ఐసీసీ స్పందిస్తూ.. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఈ టోర్నీని నిర్వహిస్తున్నందున రవాణా, భద్రత, బ్రాడ్‌కాస్టింగ్ షెడ్యూల్‌ను ముందుగానే ప్లాన్ చేసుకోవడం కోసమే ఇలా చేశామని చెబుతోంది. వేల సంఖ్యలో ప్రయాణించే అభిమానులకు, మీడియాకు ఇబ్బంది కలగకుండా ఏ జట్టు ఎక్కడ ఆడుతుందో ముందే తెలిస్తే సౌకర్యంగా ఉంటుందని ఐసీసీ వాదన.

## ఫైనల్ మ్యాచ్‌ను మించిపోయిన
# భారత్-పాక్ మహా సంగ్రామం..
## టీ20 చరిత్రలోనే కొలంబో మ్యాచ్‌కు 16.3 కోట్ల వ్యూస్



భారత్-పాకిస్థాన్ మ్యాచ్ అంటేనే అటు మైదానంలో ఆటగాళ్ల మధ్య, ఇటు సోషల్ మీడియాలో అభిమానుల మధ్య యుద్ధం నడుస్తుంది. కానీ టీ20 వరల్డ్ కప్ 2026కు ముందు జరిగిన హైడ్రామా మునుపెన్నడూ చూడనిది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చేసిన బాయ్‌కాట్ రాజకీయాలు, వేదిక మార్పు వివాదాల మధ్య ఎట్టకేలకు ఈ మ్యాచ్ జరిగింది. అయితే ఇన్ని గొడవల మధ్య జరిగిన ఈ పోరు ఇప్పుడు ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే కళ్లు చెదిరే రికార్డును నెలకొల్పింది. టీ20 వరల్డ్ కప్ ఫైనల్స్ కంటే ఎక్కువ మంది ఈ మ్యాచ్‌ను చూడటం విశేషం.ఈ మెగా టోర్నీ అధికారిక డిజిటల్, బ్రాడ్‌కాస్టింగ్ భాగస్వామి జియోస్టార్ తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఫిబ్రవరి 15న కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో జరిగిన భారత్-పాక్ మ్యాచ్ డిజిటల్ వ్యూయర్‌షిప్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. కేవలం ఆన్‌లైన్ స్ట్రీమింగ్‌లోనే ఏకంగా 163 మిలియన్ల (16.3 కోట్లు) వ్యూస్ నమోదయ్యాయి. ఇది టీ20 వరల్డ్ కప్ చరిత్రలోనే అత్యధికం. ఈ లెక్కల్లో కేవలం మొబైల్ లేదా ల్యాప్‌టాప్‌లో చూసిన వారు మాత్రమే ఉన్నారు. ఒకవేళ టీవీల్లో చూసిన వారి సంఖ్యను కూడా కలిపితే ఈ రికార్డు ఊహకందని స్థాయిలో ఉండేది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఈ వ్యూయర్‌షిప్ 2024 టీ20 వరల్డ్ కప్ ఫైనల్ కంటే చాలా ఎక్కువ. అంతేకాకుండా గత వరల్డ్ కప్‌లో జరిగిన భారత్-పాక్ గ్రూప్ మ్యాచ్‌తో పోలిస్తే ఈసారి వ్యూస్ ఏకంగా 56 శాతం పెరిగాయి. వ్యూయర్‌షిప్‌లో టీమ్ ఇండియా ఎలాగైతే డామినేట్ చేసిందో, మైదానంలో కూడా పాకిస్థాన్‌ను అదే రేంజ్‌లో ఉతికి ఆరేసింది. ఒకవైపు పాక్ ప్లేయర్స్ షేక్‌హ్యాండ్ ఇవ్వకుండా మొండికేసినా, మనోళ్లు మాత్రం బ్యాట్‌తో సమాధానం చెప్పి 61 పరుగుల భారీ తేడాతో విజయం సాధించారు. అయితే ఈ రేంజ్‌లో వ్యూస్ పెరగడానికి కేవలం క్రికెట్ మీద ఉన్న పిచ్చి మాత్రమే కారణం కాదని విశ్లేషకులు భావిస్తున్నారు. మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ చేసిన బాయ్‌కాట్ డ్రామా ఈ మ్యాచ్‌పై విపరీతమైన హైప్‌ను క్రియేట్ చేసింది. మ్యాచ్ జరుగుతుందా లేదా అన్న ఉత్కంఠ, ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు సామాన్య ప్రేక్షకుల్లో కూడా ఆసక్తిని పెంచాయి. మొత్తానికి పాక్ ఆడిన రాజకీయ క్రీడ బ్రాడ్‌కాస్టర్లకు కాసుల వర్షం కురిపించగా, పాక్ జట్టుకు మాత్రం ఘోర పరాజయాన్ని మిగిల్చింది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్ CINEMA
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com